J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 42 సంచిక : 39 03.03.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## జీరోని.. హీరోని చేస్తున్నారు



### పాడు సలహాలతో కీడు చేస్తున్నారు!
### కనిపించని దళం.. సర్వత్రా అధికార గణం!!

యుద్ధం చేసేటప్పుడు ప్రత్యర్థులుండడం సర్వ సాధారణం. యుద్ధం చేసేటప్పుడు ఇరువైపులా రాజకీయ చాణుక్యులుంటారు, ఎత్తులు పైఎత్తులు ఉంటాయి. సైన్యాధ్యక్షులుంటారు, సైన్యం ఉంటుంది. ఇలా రెండు వైపులా ఉంటేనే ఒకరి సత్తా మరొకరికి తెలిసి వస్తుంది.

రాజకీయాలలోనూ అంతే... ప్రతిపక్షం అన్నది ఉంటేనే పాలకపక్షానికి బలం. తమకి కూడా తెలియకుండా తమ పార్టీలో జరిగే అవకతవకలను వేలెత్తి చూపించి మనల్ని మేల్కొలిపేదే విపక్షం. అలాకాకుండా మొత్తం 175కి 175 సీట్లూ తమ పార్టీకే రావాలని వైసీపీ అధ్యక్షులు, ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంటున్నారు. అది ఆయన వ్యక్తిగత ఆలోచన, ఆకాంక్ష. అందులో తప్పులేదు.

గడచిన నాలుగు దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాలలో తన ఉనికిని చాటుతున్న పార్టీ తెలుగుదేశం. తెలుగుదేశం కూడా ఆనాడు కాంగ్రెస్‌పార్టీ విధానాలను, నియంతృత్వ పోకడలను... వ్యతిరేకిస్తూ పుట్టిన ప్రాంతీయ పార్టీయే. వైసీపీ కూడా అదే తరహాలో కాంగ్రెస్‌పార్టీపై కోపంతో

10లో




5లో

### ఎన్నిక ఏకగ్రీవమైంది..
### మేరిగ మురళి ఎమ్మెల్సీ అయ్యారు

## పార్టీ సేవకు.. ఇక సెలవు!

### ముగియనున్న సోనియా సారథ్యం
### యువతతోనే కాంగ్రెస్‌కి పూర్వవైభవం సాధ్యం



**'సోనియమ్మ!.. వెళ్ళిపోతోంది'... పార్టీ సేవకు ఆమె ఇక సెలవంటోంది! ఈ మాటే ఇప్పుడు కాంగ్రెస్‌తో పాటు అన్ని రాజకీయవర్గాల్లో జోరుగా వినిపిస్తోంది. కాంగ్రెస్‌లో ఇంతకాలం చక్రం తిప్పిన అధినేత్రి సోనియాగాంధీ, తానిక రాజకీయాల నుంచి రిటైర్ కావాలని అనుకుంటున్నట్లుగా సంకేతాలివ్వడమే ఇప్పుడు దేశవ్యాప్త రాజకీయాలలో హాట్ టాపిక్.**

ఇటీవల చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో జరిగిన కాంగ్రెస్‌పార్టీ 85వ ప్లీనరీ సమావేశంలో సోనియా తన పాతికేళ్ళ రాజకీయ ప్రస్థానంపై స్పందించారు. తన 'ఇన్నింగ్స్ ముగిసినట్లేనని' తానే స్వయంగా ప్రకటించడంతో, పార్టీలో కలకలం రేగుతోంది. ఆమె ఇక పార్టీని వదిలినట్లేనని, తర్వాత రాజకీయాల నుంచి కూడా వైదొలగుతారనే ప్రచారం కూడా ఊపందుకుంది. ఆమె పార్టీని వీడడం పట్ల రకరకాల ఊహాగానాలు సాగుతున్నాయి. పార్టీని వీడడం మంచిదేనని కొందరు భావిస్తుంటే, రాజకీయంగా ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆ

10లో




శ్రీ కొండా కోటారెడ్డి గారు
దామరమడుగు

## ఉత్తరక్రియలు

మా ఇంటి దైవం, మా అభివృద్ధికి కారకులు

**శ్రీ కొండా కోటారెడ్డి గారు**

తేది. 23.02.2023 గురువారం పరమపదించినారు.
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

కుమారులు - కోడళ్ళు

**కొండా చంద్రమోహన్‌రెడ్డి - స్వర్ణలత**
**కొండా రవీంద్రరెడ్డి - అరుణ**

మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, మునిమనుమరాలు

**పెద్దకర్మ:**

**తేది. 09.03.2023 గురువారం**
ఉదయం 10 గంటలకు నెల్లూరుజిల్లా, బుచ్చిరెడ్డిపాలెం మండలం, దామరమడుగు గ్రామంలోని మా స్వగృహము నందు జరుగును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# ఆయన వెంటే..ఆమె కూడా!..

## కళాతపస్వి విశ్వనాథ్ సతీమణి.. జయలక్ష్మి కన్నుమూత



***ఆయన వెంట..ఆమె కూడా వెళ్ళిపోయారు. దీంతో వారింట విషాదమే మిగిలింది. ప్రముఖ సినీదర్శకుడు, కళాతపస్వి కె. విశ్వనాథ్ మరణించిన 24 రోజులకే ఆయన సతీమణి జయలక్ష్మి (88) మరణం విషాదకరం. విశ్వనాథ్ చనిపోయిన ఆసుపత్రిలోనే, అదే వార్డులోనే ఆమె కూడా కన్నుమూయడం విధి విచిత్రం!..***

ప్రఖ్యాత సినీదర్శకుడు కె. విశ్వనాథ్ సతీమణి జయలక్ష్మి ఫిబ్రవరి 26వ తేది ఆదివారం పరమపదించారు. ఆమె మరణంతో వారి కుటుంబం శోకసాగరంలో మునిగిపోయింది. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, భర్త విశ్వనాథ్ మరణంతో కుంగిపోయారు. మరింత అనారోగ్యానికి గురయ్యారు. ఆదివారం తీవ్రఅస్వస్తతతో హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో ఆమె తుదిశ్వాస విడిచారు. రోజుల వ్యవధిలోనే విశ్వనాథ్ దంపతులు మరణించడంతో వారి కుటుంబసభ్యులు ఆ విషాదాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఫిబ్రవరి 2న విశ్వనాథ్ కన్నుమూసిన ఆసుపత్రిలో, అదే వార్డులోనే ఆమె కూడా కన్నుమూయడం యాదృచ్ఛికమే అయినా, ఎన్ని జన్మల బంధమో!. ఒకేచోట ఇరువురూ తుదిశ్వాస విడవడం వారిరువురి 'ఆత్మ బంధాన్ని', ఆత్మీయానుబంధాన్ని గుర్తు చేస్తుందనుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లోని కైకలూరు ఆమె స్వస్థలం. 1935లో జన్మించారామె. బందరులో చదువుకున్నారు. 1948 అక్టోబర్ 2న కె.విశ్వనాథ్‌తో ఆమె వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు.. పద్మావతిదేవి, నాగేంద్రనాథ్, రవీంద్రనాథ్ ఉన్నారు. సోమవారం జరిగిన ఆమె అంత్యక్రియల్లో కుటుంబసభ్యులతో పాటు అనేకమంది సినీప్రముఖులు పాల్గొని కడసారి నివాళులర్పించారు.



## జక్కా పార్వతమ్మకు నివాళి

జిల్లా కమ్యూనిస్టు యోధుడు, మాజీ ఎమ్మెల్యే జక్కా వెంకయ్య సతీమణి, ఇటీవల మృతిచెందిన జక్కా పార్వతమ్మకు ఫిబ్రవరి 26న సిపిఎం నాయకులు నివాళులర్పించారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగులోని పుచ్చలపల్లి పెంచలయ్య కళావిజ్ఞాన కేంద్రంలో జరిగిన సంతాపసభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మండల కార్యదర్శి గండవరం శ్రీనివాసులు, స్థానిక నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జక్కా పార్వతమ్మ పేదలకు చేసిన సేవలను కొనియాడారు. నాయకులు పి.శ్రీరాములు, డాక్టర్ దత్తాత్రేయులు, జక్కా వెంకయ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో.. స్టీల్‌ప్లేట్స్ వితరణ



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 27న స్థానిక రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్‌లోని 50 మంది మానసిక వికలాంగులకు స్టీల్‌ప్లేట్స్‌ను వితరణగా అందజేశారు. దాతలు పలగాటి శ్రీనివాసులురెడ్డి, బిరదవోలు రామమోహన్‌రెడ్డిలతో పాటు వాకర్స్ ప్రతినిధులు నలుబోలు బలరామయ్యనాయుడు, తలపనేని హరిబాబు, షేక్ నజీర్‌అహ్మద్, మాగంటి ప్రసాద్, బెల్లం చెంచయ్య, కాగొల్లు శివయ్య, భాగవతులు విజయరాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 'లయన్స్ క్లబ్' ఆధ్వర్యంలో అన్నదానం



ఆత్మకూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26న ఆదివారం నాడు ఆత్మకూరులో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ పూర్వ గవర్నర్, నెల్లూరులోని 'శుభమస్తు షాపింగ్‌మాల్' అధినేత బయ్యా రవికుమార్ తమ మాతృమూర్తి బయ్యా సరోజనమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా, తల్లి జ్ఞాపకార్ధం ఆత్మకూరులోని పాతహాల్‌సెంటర్ వద్ద సుమారు 200 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మెంటా శ్రీనివాసులు, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి దోర్నాదుల శ్రీనివాసులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి బాధితులను ఆదుకోవాలి

**రూరల్ సిఐ గంగాధర్‌రావు**

రక్తదానమంటే ప్రాణదానంతో సమానమని, యువత రక్తదానం చేసి బాధితులను ఆదుకోవాలని నెల్లూరు రూరల్ సిఐ గంగాధర్‌రావు పిలుపునిచ్చారు. వెంకటాచలం మండలంలోని పూడిపర్తి గ్రామంలో ఇటీవల శివాజీ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రక్తదానం పట్ల అందరూ అవగాహన పెంచుకొని రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మోపూరు భాస్కర్‌నాయుడు అంకిత భావంతో ఎంతోకాలంగా శివాజీ యూత్ ఫౌండేషన్ ద్వారా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తుండడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో యువకులు పెద్దసంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. గ్రామ సర్పంచ్ డక్కిలి శ్రావణి, ఎంపీటీసీ రఘునాథ్‌రెడ్డి, నీలకంఠ శ్రీనివాసరెడ్డి, వెంపులూరు హరి, శరత్‌బాబు, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**- సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్**



పెండింగ్ కేసుల పరిష్కారం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన కాలాన్ని వృధా చేసుకోకుండా కోర్టులో జరిగే లోక్‌అదాలత్‌లో వాటిని పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్‌జడ్జి శ్రీనివాసులునాయక్ సూచించారు. ఫిబ్రవరి 27న కోవూరు సమీపంలోని పడుగుపాడులో లారీయార్డ్ అసోసియేషన్ సమావేశమందిరంలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. న్యాయ సేవలను పేదలకు సైతం అందించాలనే ధ్యేయంతో లోక్‌అదాలత్ ఎంతగానో కృషి చేస్తోందని వివరించారు. రవాణాశాఖ ప్రాంతీయ ఇన్‌చార్జి అధికారి కె.మురళీ మోహన్, లారీ అసోసియేషన్ సభ్యులు బాలయ్య, కొండలనాయుడు, కబీర్ తదితరులు పాల్గొన్నారు.

## షాహినాకు సన్మానం



గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీస్ సంక్షేమసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇటీవల నెల్లూరుజిల్లాకు చెందిన షాహినా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నెల్లూరులోని రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్, పిఎంపి అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఇటీవల జ్యోతినగర్‌లోని వసుజ్యోతి కార్యాలయంలో సన్మానించారు. కేంద్రప్రభుత్వ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ నాగసాయి సూరి, పిఎంపిల అసోసియేషన్ జిల్లా శాఖ నాయకులు వేణుగోపాల్, జయప్రకాష్‌లతో పాటు వసుజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ వసుంధర తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు కుట్టు శిక్షణ

పొదలకూరులోని సెయింట్ మైకేల్స్ ప్రాంగణంలో ఇటీవల నెల్లూరుకు చెందిన 'ప్రతిభ లయన్స్ క్లబ్' ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటుచేశారు. మూడు నెలల శిక్షణ తర్వాత వారికి సబ్సిడీపై కుట్టుమిషన్లు కూడా అందజేస్తామని, మహిళల ఉపాధికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని నిర్వాహకులు చెప్పారు. ప్రతిభ లయన్స్ అధ్యక్షుడు ఎం.సునీల్, కార్యదర్శి వి.శ్రీధర్, కోశాధికారి లక్ష్మీనారాయణ, శిక్షకురాలు సిస్టర్ అనిత, క్లబ్ ఫౌండర్ ఎస్ఎస్వీ రామ్మోహన్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

**సవరణ :** గత సంచిక (ఫిబ్రవరి 24వ తేదీ) 'లాయర్' మొదటిపేజీలో 'శాసనమండలి స్థానానికి మేరిగ మురళి' అనే వార్తలో, 'మేరిగ మురళి తండ్రి రామక్రిష్ణయ్య' అని ప్రచురితమైంది. రామక్రిష్ణయ్య మేరిగ మురళికి 'పెదనాన్న'..అని సవరించి చదువుకోగలరు. పొరపాటుకు చింతిస్తున్నాం. – సం/–


### FORM IV
(See Rule 8)

Statement about Ownership and other Particulars about News Paper, **Lawyer (Weekly)**

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 2. Periodicity of its Publication | : | Weekly |
| 3. Printer's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 4. Publisher's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 5. Editor's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 6. Name and Address of individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total Capital | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |

I, Thunga Siva Prabhath Reddy hereby declare that the particulars given above are true to the best of my Knowledge and belief.

(Sd)

01.03.2023 SIVA PRABHATH REDDY.T





## దేదీప్యమానం..

# చెంగాళమ్మ 'స్వర్ణ కలశ' గోపురం

- ఆలయానికి స్వర్ణశోభ తెచ్చిన వేమిరెడ్డి దంపతులు
- అమ్మవారి దేవాలయంలో బంగారు కలశాల ప్రతిష్ఠ
- మూడురోజుల పాటు విశేష పూజలు, అభిషేకాలు



**తెలుగు-తమిళ ప్రజల ఆరాధ్య దైవం, భక్తులపాలిట కొంగుబంగారం, చల్లనితల్లి శ్రీ చెంగాళపరమేశ్వరి అమ్మవారి దేవాలయం బంగారు కలశాలతో ధగధగా మెరిసిపోయింది. కొత్త స్వర్ణ గోపుర కలశ ప్రతిష్ట, మహా కుంభాభిషేక మహోత్సవాలతో అమ్మవారి కోవెల దేదీప్యమానమైంది. వేద మంత్రాలతో ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా స్వర్ణ కలశాలను ప్రతిష్ఠించగా, ఈ కార్యక్రమాలకు ఉభయ దాతలైన అమ్మవారి భక్తులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి - ప్రశాంతిరెడ్డి దంపతులు, భక్తిశ్రద్ధలతో సుగంధద్రవ్యాలతో ఆ శిఖర కలశాలకు అభిషేకాలు చేసి తరించారు. ఇటీవల సూళ్ళూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ దేవాలయంలో ఈ వేడుకలు మూడురోజుల పాటు వైభవంగా జరిగాయి.**



శ్రీ చెంగాళపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో నూతన స్వర్ణ గోపుర కలశ ప్రతిష్ఠ నయనానందకరంగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ వేడుకలో అమ్మవారి వైభవాన్ని తిలకించి పులకించిపోయారు. యాగశాలలో ప్రత్యేక పూజల అనంతరం వేమిరెడ్డి దంపతులు పాల్గొని అమ్మవారికి విశేష పూజలుచేసి, కలశాలను స్వయంగా తీసుకువచ్చి శిఖర ప్రతిష్ఠ కుంభాభిషేకం నిర్వహించారు. నయనానందకరంగా సాగిన ఈ వేడుకల్లో సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆలయ ఛైర్మెన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఇఓ ఆళ్ళ శ్రీనివాసులు రెడ్డి దంపతులు యాగంలో పాల్గొని 16 స్వర్ణ గోపుర శిఖర కలశాలకు పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, కైలాసమండపారాధన, త్రిశూల పూజ, నవగ్రహ మండపారాధన, శాంతి కుంభావాహన, హోమాలు నిర్వహించారు. అమ్మవారి ఆస్థానమండపంలో లక్ష కుంకుమార్చన పూజలు చేశారు. యాగశాల అర్చనలు, కుంభస్థాపన, రుద్ర హోమం, దుర్గాహోమం దివ్యంగా జరిగాయి. శ్రీ చెంగాళమ్మ మూలమంత్ర హోమంతో ఆలయం మార్మోగింది.

### తిరుమల వలెనే బంగారు తాపడం

తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న ఆనందనిలయం తరహాలోనే శ్రీ చెంగాళమ్మ దేవాలయంలో కూడా విమాన గోపురానికి బంగారు తాపడం చేయాలని వేమిరెడ్డి దంపతులు సంకల్పించి, దాతలుగా వాటిని తయారుచేయించి ఆలయ శిఖరంపై నెలకొల్పి అమ్మవారి ఆలయానికి నూతన స్వర్ణశోభను తెచ్చారు. తొలుత, స్వర్ణతాపడం చేసిన 16 కలశాలను వారు అమ్మవారి పాదలచెంత ఉంచి ప్రత్యేక పూజలు చేసి, ఆ తర్వాత వాటిని ప్రతిష్టించారు. ఈ మహా కుంభాభిషేక మహోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయంలో మూడురోజుల పాటు నిర్వహించిన లక్ష కుంకుమార్చన పూజలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. డెప్యూటీ సీఎం నారాయణస్వామి, మునిసిపల్ ఛైర్మెన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి తదితర ప్రముఖులు, దూరప్రాంతాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పాలకమండలి ఛైర్మెన్, అధికారులతో పాటు పాలకమండలి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, దినేష్‌కుమార్, సురేష్‌కుమార్, సునీత, పద్మజ, మారెమ్మ, నాగమణి, సత్యనారాయణ తదితరులు ఈ వేడుకలను పర్యవేక్షించారు.



ఇటీవల హైదరాబాద్‌కి వచ్చిన కేంద్ర సమాచార, ప్రసార మరియు క్రీడలు యువజన విభాగాల మంత్రి అనురాగ్ ఠాకూర్‌ని తన నివాసంలో సత్కరించిన మెగాస్టార్ మరియు మాజీ కేంద్రమంత్రి చిరంజీవి. పక్కనే అక్కినేని నాగార్జున, ఏఎంఆర్ సంస్థల ఛైర్మెన్ ఆల్తూరు మహేష్‌రెడ్డి ఉన్నారు.

# ఎమ్మెల్సీ బరిలో..అభ్యర్థులు వీరే!

**ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల స్థానాలకు 22మంది, ఉపాధ్యాయ స్థానాల్లో 8 మంది పోటీలో ఉన్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యాక బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాను ఇటీవల చిత్తూరుజిల్లా కలెక్టర్ హరినారాయణన్ వెల్లడించారు. ఆ వివరాలివీ!..**

### పట్టభద్రుల అభ్యర్థులు :

పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి (వైఎస్సార్సీపి-తిరుపతి), కంచర్ల శ్రీకాంత్ (టిడిపి-నెల్లూరుజిల్లా), సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి (బిజెపి-తిరుపతి) పోటీలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా నీలం శామ్యూల్ మోజెస్ (బాపట్ల జిల్లా), కిరణ్ దాసరన్న ( ప్రకాశం), మాదసి జలరావు (ప్రకాశం), భాస్కర్‌రావు కమ్మిశెట్టి (ప్రకాశం), బొట్టికాయల చంద్రశేఖర్ (తిరుపతి), సరిత (నెల్లూరు), పల్లిపట్టు అభినవ్ విష్ణు (చిత్తూరు), మీగడ వెంకటేశ్వరరెడ్డి(ప్రకాశం), పంతంగి పాలంక రెడ్డి(ప్రకాశం), దొడ్ల శ్రీహరి(తిరుపతి), పూసల రవి (చిత్తూరు), అంకయ్యచౌదరి మక్కెన (నెల్లూరు), నక్కా దినేష్(నెల్లూరు), కరుణానిధి చిరిపిరెడ్డి (తిరుపతి), కొమ్ము యోహాను (ప్రకాశం), జయపాల్ అప్పంగారి (తిరుపతి), బుస్సా రాజేంద్ర (చిత్తూరు), మహేందర్ రెడ్డి నంద్యాల(నెల్లూరు), వీరభద్రాచారి బరిలో ఉన్నారు.

### ఉపాధ్యాయ అభ్యర్థులు :

పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి (వైఎస్సార్సీపి-నెల్లూరు), కుట్టుబోయిన బ్రహ్మానందం (బిజెపి అనుబంధ సంఘం ఆపస్-నెల్లూరు), బాబురెడ్డి పొక్కిరెడ్డి (పిడిఎఫ్-నెల్లూరు), ప్రవీణా పర్వతరెడ్డి (నెల్లూరు), గుర్రం శ్రీరామమూర్తి (చిత్తూరు), ధనుంజయ శివయోగి (అన్నమయ్యజిల్లా), చిన్న రమణారెడ్డి లక్కు (నెల్లూరు), అనసూయమ్మ లక్కు (నెల్లూరు) ఉపాధ్యాయ ఎన్నికల బరిలో ఉన్నారు.

## ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు

జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లన్నీ పటిష్టంగా చేస్తున్నామని, ఈనెల 8వతేది లోపు ఓటర్ల స్లిప్‌లను పంపిణీచేస్తామని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. మార్చి 1న రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, నెల్లూరుజిల్లాలో 1,07,635 మంది పట్టభద్రుల ఓటర్లు, 8165 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని, పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేస్తున్నామని, పట్టభద్రుల కోసం 129, ఉపాధ్యాయుల కోసం 40 పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు మాట్లాడుతూ ఎన్నికల విధుల కోసం జిల్లాలో 1300 మంది పోలీస్ సిబ్బందిని నియమించామని, 49 ప్రత్యేక టాస్క్ బృందాలు, 21 రూట్‌లలో సెక్టోరల్ మొబైల్ అధికారులను నియమించామని చెప్పారు.

## పేర్నాటికి సంఘీభావం



మార్చి 13న జరిగే తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాపా తరఫున పోటీచేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి తమ సంఘం సంఘీభావం ప్రకటిస్తోందని, ఆయన గెలుపుకు అందరూ సహకరించాలని అఖిల భారత దళిత, గిరిజనుల సంక్షేమసంఘం నెల్లూరుశాఖ ఆర్గనైజింగ్ సెక్రటరీ మన్నెపల్లి దాసు తెలిపారు. నెల్లూరులోని 23వ డివిజన్ కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లాలో ఎస్‌సి,ఎస్టీలకు పేర్నాటి చేస్తున్న సేవలను అభినందించారు. సంఘం నగర అధ్యక్షులు బూరగ పురుషోత్తం, గౌరవసలహాదారు బండి శ్రావణ్‌కుమార్, దార్ల రత్నం తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూరులో నేత్రపర్వంగా 'నాగప్రతిష్ఠ'

### శ్రీ యోగాంజనేయస్వామి దేవాలయంలో నాగదేవతకు విశేష పూజలు



ఇందుకూరుపేట మండలం కొత్తూరు గ్రామంలోని శ్రీ యోగాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ఫిబ్రవరి 27న నాగదేవత విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఎంతో వేడుకగా.. నేత్రపర్వంగా జరిగింది. వేలాదిమంది భక్తులు పాల్గొని మహా మహిమాన్వితమైన నాగదేవతకు పూజలు చేసుకున్నారు. ప్రముఖ దాత, దేవాలయ నిర్మాత కలికి కోదండరామిరెడ్డి-శ్రీలత దంపతుల ఆధ్వర్యంలో, కర్నాటక నుంచి వచ్చిన ప్రసిద్ధ వేదపండితుల నేతృత్వంలో ప్రత్యేక పూజల అనంతరం నాగదేవత ప్రతిష్ఠామహోత్సవం ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగింది. ముందురోజు..26వ తేది నుంచి నాగదేవతకు పూజలు ప్రారంభమయ్యాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక, దూర ప్రాంతాల నుంచి సైతం పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులకు ఆలయ నిర్వాహకులు నాగదేవత దర్శనం అనంతరం, అన్నప్రసాద వితరణ గావించారు.



లాయర్
మార్చి 03, 2023

# దానవుడవుతున్న మానవుడు!

మనిషిలో రానురాను పైశాచికత్వం పెరిగిపోతోంది. రాక్షసత్వం ప్రబలిపోతోంది. మానవత్వంతో నిండివుండాల్సిన మనిషి వికృతరూపం దాలుస్తున్నాడు. మానవుడే దానవుడవుతున్నాడు. ఇటీవలి కాలంలో దేశంలో పలుచోట్ల జరుగుతున్న అత్యంత క్రూర, ఘోర సంఘటనలు సభ్యసమాజాన్ని తీవ్రంగా కలచివేస్తున్నాయి. మరీ విశ్వవిద్యాలయాల్లో, కళాశాలలో, విద్యాసంస్థల్లో అకృత్యాలు, అత్యంత జుగుప్సాకర సంఘటనలు అందరికీ ఆవేదన కలిగిస్తున్నాయి. చదువుల తల్లి ఒడిలో హాయిగా చదువుకోవాల్సిన విద్యార్థులు రకరకాల హింసాప్రవృత్తులకు, ర్యాగింగ్ వంటి వికృతచేష్టలకు అలవాటు పడుతున్నారు. అనేకమంది విద్యార్థులు లేనిపోని వత్తిడితో బలవన్మరణాలకు కూడా పాల్పడుతున్నారు. ఎన్నిరకాల చర్యలు తీసుకుంటున్నా, కఠినమైన చట్టాలున్నా మనదేశంలో ఆడపిల్లలను వేధించడం అనే దారుణ దౌర్భాగ్య స్థితి ఇంకా సమసిపోవడం లేదు. ఎక్కడ చూసినా స్త్రీలకు, మహిళలకు, బాలికలకు వేదనలు తప్పడం లేదు. నైతిక విలువలన్నవి కలికానికి కూడా కనిపించడం లేదు. నిత్యం ఎంతమంది ఎన్నిరకాల అకృత్యాలకు బలైపోతున్నారో లెక్కే ఉండడం లేదు. అందులోనూ, ఇటీవలి కాలంలో బాగా తగ్గిపోయిందనుకున్న ర్యాగింగ్ తగ్గకపోగా..అదింకా వెర్రితలలు వేస్తూనే ఉండడం విచారకరం. ఆ విషసంస్కృతి విద్యాలయాలను, చివరికి విశ్వవిద్యాలయాలను కూడా నేటికీ వదలడం లేదు. అందుకు, ప్రీతి మరణమే ఒక ప్రత్యక్ష సాక్ష్యం. సీనియర్ల వేధింపులు తట్టుకోలేక వరంగల్ వైద్యవిద్యార్థిని డాక్టర్ ప్రీతి ఇటీవల ఆత్మహత్యకు పాల్పడి, ఆసుపత్రి పాలై అయిదు రోజులపాటు మృత్యువుతో పోరాడి, చివరికి అర్ధాంతరంగా తనువు చాలించిన దారుణం ఉభయ తెలుగురాష్ట్రాల ప్రజలను కంటతడిపెట్టించింది. కాకతీయ మెడికల్ కాలేజీలో పొందివున్న ర్యాగింగ్ భూతానికి ప్రీతి బలైపోయింది. దేశవ్యాప్తంగా ఇంకా ఎన్నో విశ్వవిద్యాలయాలున్నాయి. దేవాలయాల్లాంటి విశ్వవిద్యాలయాలు సైతం ర్యాగింగ్ వంటి అకృత్యాలతో, అరాచకాలతో భూతాల నిలయంగా మారిపోతుండడం బాధాకరం. ర్యాగింగ్‌ను అరికట్టేందుకు ప్రభుత్వాలు ఎంతగా కఠినమైన చర్యలు తీసుకుంటున్నా అక్కడక్కడా ఆ హింస కొనసాగుతూనే ఉన్నట్లు తెలుస్తోంది. ఎంతో పవిత్రమైన వైద్యవృత్తిలోకి రావాలని ఆకాంక్షిస్తూ వైద్య కళాశాలలకు వచ్చి, కనీస మానవత్వం కూడా లేని ర్యాగింగ్ రాకాసుల పాల్పడుతున్న విద్యార్థులెందరో ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సంస్కారం గల మేధావులందరూ ర్యాగింగ్ రాకాసురులను అరికట్టేందుకు రంగంలోకి దిగాలి. చట్టాలకు మరింత పదునుపెట్టి కఠిన చర్యలు తీసుకోకుంటే, భవిష్యత్తులో విశ్వవిద్యాలయాలు, విద్యాలయాలు మరింత పైశాచికత్వాలకు నిలయంగా మారుతాయి. ఇదిలావుంటే, మరో ఘటనలో తాను ప్రేమించిన యువతిని ప్రేమిస్తున్నాడన్న కోపంతో హైదరాబాద్‌లో ఓ బీటెక్ విద్యార్థి స్నేహితుణ్ణే నరికిపారేసి, తల-మొండెం వేరు చేసి, గుండెను కూడా చీల్చేసి, ఆ అవయవాలతో సెల్ఫీ దిగడం రాక్షసులకు సైతం గగుర్పాటు కలిగించే సంఘటన. ఎంతో ఘోరమో చూడండి!..అంతేకాదు, కర్నాటకలో కన్నతండ్రినే ముక్కలుముక్కలుగా నరికి రాక్షసత్వానికి పరాకాష్ఠగా నిలిచాడో కొడుకు. అంతెందుకు, మొన్నటికి మొన్న ఆదివారం చిత్తూరులో ఓ తండ్రిపై కన్నకొడుకే అత్యంత దారుణంగా దాడిచేస్తూ, తన వీరంగాన్ని గొప్పగా తన ప్రియురాలికి వీడియోకాల్‌లో చూపించాడంటే ఏమనుకోవాలి?..మంచిదారిలో నడవమని చెప్పినందుకు, ఆ తండ్రిని కర్రతో భయంకరంగా కొట్టి, గాయాలపాలు చేయడం ఎంత దారుణం?..సమాజంలో నైతిక విలువలు పతనమైపోతున్నాయనేందుకు నిదర్శనంగా ఇలాంటివెన్నో భీతావహ సంఘటనలు అనునిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఇకనైనా సమాజంలో ఈ పైశాచిక ప్రవృత్తి పోవాలి. హింసాత్మక ధోరణులను విడనాడాలి. అందుకు మానవీయమూర్తులంతా తమవంతు కృషి చేయాలి.

ఏదేమైనా, మానవజన్మ అమూల్యమైనది. అది ఆ భగవంతుడు మనకిచ్చిన వరం. ఎన్నో జన్మల పుణ్యఫలంగా వచ్చిన ఈ జన్మను మంచిపనులతో సార్థకం చేసుకోవాలి. ముఖ్యంగా, మానవత్వంతో ఉన్నవాడే మనిషని అర్థం చేసుకోవాలి. సాటి మనుషులను మనుషులుగా చూడాలి. అలా లేనప్పుడు రాక్షసుడికి..మనిషికీ తేడా ఏముంటుంది?..ఇకనైనా దానవత్వాన్ని వదలాలి. మహోన్నతమైన మానవీయతత్వంతో, మానవత్వానికి ప్రతిరూపంగా నిలవాలి. మానవుడు దానవుడిగా కాదు..మానవుడే దేవుడుగా దీపించాలి.

# తూకాల్లో మోసాలు!



'కొనేవాళ్లు అమాయకులైతే.. అమ్మేవాళ్లు ఎంత మోసాలైనా చేస్తారన్నట్లు'గా ఉంది..మన మార్కెట్ వ్యవస్థ. కాలాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా, అధికారులు మారిపోతూనే ఉన్నా మార్కెట్లో మోసాలు అన్నవి ఎప్పటికప్పుడు పెరుగుతుండడమే తప్ప వాటికి విరుగుడన్నది కనిపించడం లేదు. ఒక్కచోటని కాదు.. ఎక్కడ చూసినా ఇదే తంతు. ఒక్క నెల్లూరనే కాదు, రాష్ట్రమంతా, దేశమంతా ఇదే మాయాజాలం. ధర్మబద్ధంగా ధరలు పెట్టి న్యాయంగా వ్యాపారం చేసుకునేవారు దేశంలో అక్కడక్కడా ఉన్నా, అధికశాతం మంది వ్యాపారులు కేవలం ధనార్జనే ధ్యేయంగా వ్యాపారం చేస్తుంటారు. ఆ వ్యాపారంలో ఎన్ని మోసాలైనా సరే అవలీలగా చేసేస్తుంటారు. 'అవతలివారు ఏమైపోయినా పర్వాలేదు..మనం బాగుంటే చాలు' అనుకుంటుంటారు. ప్రజలు తినే ఆహారంలో కూడా కల్తీ చేసి డబ్బులు గుంజేస్తుంటారు. బంగారం మొదలుకుని, కూరగాయల దాకా..ఏ వస్తువైనా సరే, కొనేవారిని బురిడీ కొట్టించడం మోసపు వ్యాపారులకు అత్యంత తేలికైన పని. మనిషిని బట్టి మోసం జరిగిపోతూనే ఉంటుంది. ఒకవైపు వస్తువుల్లో నాణ్యత ఉండదు. కల్తీ అన్నది ఎటూ కలిసే ఉంటుంది. అసలు కల్తీ లేని వస్తువులేమైనా ఈ భూప్రపంచం మీద ఉన్నాయా?.. ఉంటే వాటిని మ్యూజియంలలో ప్రదర్శనకు పెట్టాల్సిందే అన్నట్లుంది నేటి కాలంలో పరిస్థితి. అలాంటి నాశిరకం వస్తువులకు కూడా పెద్ద డిమాండ్ సృష్టించేస్తారు. మార్కెట్లలోకి వచ్చే కూరగాయలు వగైరాలను పండించే రైతులకు మాత్రం కనీసం గిట్టుబాటు ధర కూడా ఉండదు. కూటినీళ్లకి వాళ్ళు తమ కష్టాన్ని అమ్మేసుకుపోవాల్సిందే. అలా, అత్యంత తక్కువ ధరకి వాళ్ళ దగ్గర లాగేసుకుని, దుకాణాదారులు, మార్కెట్లలో దళారులు ఎక్కువ ధరకు వాటిని అమ్ముతుంటారు. దుకాణాల వాళ్ళు వాటిని అంగట్లో పెట్టాక, వాటి రేట్లు ఆమాంతం ఆకాశానికి

## సమస్యల తో 'రణం'

ఎగరేస్తారు. ఆ భారమంతా చివరికి వినియోగదారుడి నెత్తికే చుట్టేస్తారు. అదేమని అడిగితే, 'కొంటే కొనండి..లేకపోతే పోండి'.. అని కసురుకుంటారు. పోనీ ఆ ఇచ్చే సరుకులైనా న్యాయబద్ధంగా, నాణ్యతగా ఉంటాయా అంటే అదీ లేదు. మార్కెట్లలో మోసపు తూకాలకు అడ్డే ఉండడం లేదు. తూకంలో కిలోకి వంద గ్రాములైనా సులభంగా తగ్గించేస్తారు. కాటాలు, తక్కెడలు, తక్కెడరాళ్ళ కాలం ఎటూ పోయింది. అవి సరిగా ఉండడం లేదంటూ డిజిటల్ తూకాల కాలం వచ్చేసింది. ఎలక్ట్రానిక్ కాటాలు కదా, కచ్చితంగా ఉంటాయి అనుకుంటారు అమాయక జనం. కానీ మోసం చేసి డబ్బులు గుంజాలనుకునే వ్యాపారులు, వాటితో కూడా మోసాలకు పాల్పడుతుంటారు. ఎన్నని గమనించగలం?..గమనించినా ఏం చేయగలం?..అనే నిర్వేదం ప్రతి ఒక్కరిలో ఉంటుంది. చిల్లర దుకాణాలు, చికెన్ షాపులు, చేపల మార్కెట్లు, కూరగాయల మార్కెట్లలో ఇలా చాలాచోట్ల తూకం కచ్చితంగా ఉంటుందనే నమ్మకం ఉండడం లేదు. 'తూకం తక్కువ-ధర ఎక్కువ'.. అన్నది వాళ్ళ వ్యాపార సూత్రం. చేపల మార్కెట్లలో సంగతి అసలు చెప్పనే అక్కర లేదు. చేపలు కొంటే ఒక ధర, వాటిని శుభ్రం చేసిస్తే మరో ధర. రొయ్యలదొక ధర, వాటిని వలిచిస్తే మరో ధర. ఇళ్ళల్లో వాటిని శుభ్రం చేసుకోలేని వాళ్ళ బలహీనతని అలుసుగా తీసుకుని, మార్కెట్లలో వ్యాపారులు నిలువు దోపిడీ చేసేస్తుంటారు. వస్తువేదైనా సరే, ప్రతి వస్తువు మీద తాము కొన్న ధరకంటే మరీ ఎక్కువ రాబడిని ఆశిస్తుంటారు. కొన్నిరకాల వస్తువులపై అంతకంత ఆదాయం కోసం అర్రులు చాస్తుంటారు. మరి!..పేదలు, మధ్యతరగతి ప్రజలు అంతంత ధరలు పెట్టి ఏం కొనగలరు?..ఏం తినగలరు?..

'హోల్‌సేల్‌లో ఒక ధర, రిటైల్ మార్కెట్లో ఒక ధర, దుకాణాల్లో ఇంకో ధర, ఇళ్లకాడికి వచ్చేసరికి ఇంకా ఎక్కువ ధర. వస్తువొకటే.. ధరలు ఎక్కడికక్కడ మారిపోతుంటాయి. ఈ పరిస్థితుల్లో ఇక, ధరలను నియంత్రించడం, తూకాల్లో మోసాలు లేకుండా అరికట్టడం అన్నది ఎవరికైనా అలివయ్యే పనేనా?..ఆ మోసాలు చాలవన్నట్లు మార్కెట్లో మళ్ళీ పోటీలొకటి. ఎవరిష్ట ప్రకారం వారు రేట్లు పెట్టేస్తారు. డిమాండ్ ఉన్న సరుకుల్ని దాచిపెట్టి, ఎక్కువ ధరలకి అమ్మేస్తుంటారు. కొనుగోలుదారుల్ని నవ్వుతూనే బురిడీ కొట్టించేస్తుంటారు. నిత్యం మార్కెట్లలో జరిగే తంతే ఇది. తూనికలు కొలతల అధికారులు, ఇతర అధికారులు ఈ తూకాల మోసాలపై తరచూ దాడులు చేస్తూనే ఉంటారు. జరిమానాలు విధిస్తూనే ఉంటారు. అయినా వాళ్ళకివో లెక్కా?..ఎంత చేసినా 'తగ్గేదే లే' అన్నట్లు మోసపు వ్యాపారాలు అనునిత్యం, అనుక్షణం సర్వేసర్వత్రా నిరాఘాటంగానే జరిగిపోతూనే ఉంటే, అధికారులు మాత్రం ఎన్నిసార్లని దాడులు చేయగలరు?.. ఆ దేవుడు కూడా వీటిని అరికట్టలేడు.. అన్నంత విచ్చలవిడి అయిపోయాయి మార్కెట్లలో తూకాల మోసాలు. కొనుగోలుదారులు కూడా సాటి మనుషులేననే మానవత్వం కూడా లేకుండా మోసం చేయడం, తినే ఆహారపదార్థాలను కూడా కల్తీచేయడం ఘోరం కదా!.. వ్యాపారాన్ని లాభదాయకంగా చేయాలనుకోవడంలో తప్పులేదు. కొద్దోగొప్పో లాభం లేకుండా ఎవరూ వ్యాపారం చేయలేరు కూడా. అది అందరికీ తెలిసిందే. అయితే, ఇచ్చిన వస్తువుకు తగ్గ ధర తీసుకోవచ్చు. దాని మీద కొంతమేరకు ఆదాయం కూడా వేసుకోవచ్చు. కానీ, మితిమీరిన ఆశతో, తక్కువ తూకాలతో, కల్తీ సరుకులతో, ఎక్కువ ధరలతో మోసం చేసి, అమాయక జనాన్ని పీక్కుతినడం ఎంతవరకు న్యాయం?..దయచేసి.. ఒక్కసారి.. మీరే ఆలోచించండి!..

- సంచారి

# మానవత్వం నశించి కర్కశత్వం పెరుగుతోంది..!

మన సమాజం ఏమైపోతోంది...? ఎటువైపు వెళ్తోంది. కలుషిత యుగంగా మారిన కలియుగంలో 'కలి' రాజ్యమేలుతున్నాడా..? అనిపిస్తోంది. తెలంగాణలోని నల్గొండ ప్రాంతంలోని మహాత్మా గాంధీ కాలేజీ విద్యార్థుల ప్రేమ వ్యవహారంలో ఇటీవల జరిగిన సంఘటన ఇలాంటి పరిస్థితికి అద్దం పడుతోంది. తాను ప్రేమించిన అమ్మాయిని తన మిత్రుడు ఇష్టపడుతున్నాడన్న అనుమానంతో ఆ స్నేహితుడిని అతి కిరాతకంగా పొట్టనపెట్టుకున్న ఉదంతం గురించి విన్నప్పుడు భయంతో పాటు ఆందోళన కూడా కలుగుతోంది. తనతోపాటు చదువుకునే నవీన్ అనే సాటి విద్యార్థిని మాయమాటలు చెప్పి మద్యం తాగించి అతి కిరాతకంగా చంపి ముక్కలుచేసిన హరి హరకృష్ణ అనే 21 సంవత్సరాల కుర్రవాడి పైశాచికత్వం, రాక్షసత్వం, క్రూరత్వం వినడానికే వణుకు పుట్టించింది. వెర్రితలలు వేస్తున్న ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే కథనాలు, అనేకచోట్ల జరుగుతున్న అరాచకాలను ప్రపంచవ్యాప్తం చేస్తున్న సామాజిక మాధ్యమాలు సమాజాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తున్నాయో అనడానికి ఈ సంఘటన పెద్ద ఉదాహరణ.

ఎం.మధుసూదన్‌రెడ్డి,
హైదరాబాద్.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## కోతలు లేని విద్యుత్ ఏదీ?

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఇటీవలే కోతలు లేని నాణ్యమైన విద్యుత్ అంటూ ఆర్భాటంగా ప్రకటించారు. కానీ వాస్తవానికి రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో విద్యుత్ కోతలు జరుగుతూనే ఉన్నాయి. నెల్లూరు నగరంలో కూడా మాటి మాటికి కరెంటు పోతూనే ఉంది. ఈ కోతలు కూడా అనధికారికంగానే ఉంటున్నాయి. కోతలు ఒకవైపైతే లోఓల్టేజీ సమస్యలు కూడా మరోవైపు ప్రజలను ఇబ్బందిపెడుతూనే ఉన్నాయి. ఇప్పుడు అసలే చదువుల కాలం. పదో తరగతి పరీక్షలు కూడా వచ్చేశాయి. ఇళ్ళు, హాస్టళ్లలో విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడడం అవసరం. ప్రభుత్వం ఈ విషయాలను పరిశీలించి విద్యుత్ అవస్థలు లేకుండా చూడాలని ప్రార్థన.

బి.సుబ్బరామశర్మ, నెల్లూరు.

## రాజశేఖరరెడ్డి గారి సమర్థతకి సాక్ష్యం శ్రీసిటీ!

వందే భారత్ రైలు విడిభాగాలు శ్రీసిటీలో తయారవుతున్నాయని చదివినప్పుడు నాకు ముందుగా రాజశేఖరరెడ్డి గారే గుర్తొచ్చారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి, తద్వారా ఉద్యోగ అవకాశాలు, అంతర్జాతీయస్థాయి పరిశ్రమలను మన రాష్ట్రానికి తేవడంద్వారా ఆంధ్రప్రదేశ్‌కి ప్రపంచస్థాయి గుర్తింపు, ఇవన్నీ ఇప్పుడు శ్రీసిటీ ద్వారా సాధ్యమవుతున్నాయి. ఇలా అన్ని కోణాలలో ఆలోచించి శ్రీసిటీ వ్యవస్థాపకులను ప్రోత్సహించారు వై.ఎస్.ఆర్ గారు. రాష్ట్రాభివృద్ధి పట్ల రాజశేఖరరెడ్డి గారికి ఉన్న ముందుచూపు, దూరదృష్టి అన్నింటినీమించిన అంకితభావానికి శ్రీసిటీ ఒక నిదర్శనం.

యు.విశ్వేశ్వరరావు, హైదరాబాదు.

# శ్రీసిటీలో.. 'ఎస్టోనియన్' ప్రతినిధుల బృందం

## మొబైల్ హెల్త్‌కేర్ యూనిట్ల తయారీ పరిశ్రమపై అధ్యయనం




సెమెట్రాన్, ఎంఎంహెచ్ గ్రూప్ ఎక్స్‌పోర్ట్స్ విభాగాధిపతి, ఎస్టోనియా మాజీ రక్షణ మంత్రి మార్గస్ త్సాక్నా నేతృత్వంలోని ఎస్టోనియన్ వ్యాపార ప్రతినిధుల బృందం, భారతీయ జాయింట్ వెంచర్ పార్ట్‌నర్స్ 'ఏపిరాన్ హెల్త్' సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లతో కలిసి ఇటీవల శ్రీసిటీని సందర్శించింది. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ భారీ పారిశ్రామిక నగరంలోని మౌళిక సదుపాయాలు, ప్రత్యేకతలు, పరిశ్రమల ఏర్పాటు ప్రయోజనాలను వివరించారు. ఎస్టోనియాకు చెందిన సెమెట్రాన్ లిమిటెడ్ ఉన్నతాధికారులు, ఏపిరాన్ హెల్త్‌కేర్ ప్రతినిధులు శ్రీసిటీ సందర్శన పట్ల రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తంచేశారు. శ్రీసిటీలో వ్యాపార అనుకూల వాతావరణం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రతిభ కలిగిన మానవ వనరులు, ప్రభుత్వ సహకారం ఖచ్చితంగా వారిని ఆకట్టుకుంటుందని రవీంద్ర సన్నారెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్శన ఎస్టోనియా మరియు ఉత్తర ఐరోపాలోని ఇతర దేశాల నుండి పెట్టుబడులకు మార్గం సుగమం చేస్తుందని పేర్కొన్నారు. వ్యాపార ప్రతినిధులు శ్రీసిటీలోని వివిధ అంశాలపై ప్రశ్నలడిగి తమ సందేహాలు నివృత్తి చేసుకున్నారు. అనంతరం పారిశ్రామికవాడను సందర్శించారు.

# జాతీయ భద్రతా వారోత్సవాలు



శ్రీసిటీలో ఫిబ్రవరి 25 నుంచి 52వ జాతీయ భద్రతా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్‌కామత్ ఈ వారోత్సవాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీసిటీ సిబ్బందికి, స్థానికులకు ఈ కార్యక్రమం ప్రాధాన్యతను వివరించి, వారిచే భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ వారోత్సవాలలో భాగంగా వారం రోజుల పాటు వివిధ అవగాహనా కార్యక్రమాలతో పాటు శ్రీసిటీ ఉద్యోగులు, ఆ ప్రాంతంలోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీసిటీ మేనేజర్ (సేఫ్టీ) నరేంద్రబాబు తెలిపారు. రోడ్డుప్రమాదాలు వగైరాలను నివారించడానికి, భద్రతా అంశాలపై ప్రజలలో విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు అవగాహన పెంచడమే ఈ భద్రతా వారోత్సవాల లక్ష్యమని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ కార్యక్రమాల గురించి ఒక ప్రకటనలో తెలిపారు. పనిచేస్తున్న ప్రదేశాలలో అధికశాతం ప్రమాదాలు అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్ల సంభవిస్తాయని, వాటిని ముందుగానే గ్రహించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు ఈ అవగాహన కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మార్చి 4 న ముగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. శ్రీసిటీ సెక్యూరిటీ చీఫ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాలధర్మం

## కొండా కోటారెడ్డి



నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు గ్రామానికి చెందిన ప్రముఖ రైతు.. వితరణ గుణశీలుడైన కొండా కోటారెడ్డి ఫిబ్రవరి 23న గురువారం నాడు కాలధర్మం చెందారు. ఆయన వయసు 94 సంవత్సరాలు. రైతుకుటుంబం నుంచి ఎదిగి, వ్యవసాయంలో ఎంతో కృషి, పట్టుదలతో ఉన్నతంగా రాణించిన కోటారెడ్డి ఉదారహృదయుడు. దామరమడుగు జూనియర్ కళాశాల నిర్మాణ దాత కూడా ఆయనే. ఆ దాతృత్వమే ఆయనకు మరింత మంచిపేరు తెచ్చింది. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు కొండా చంద్రమోహన్‌రెడ్డి ఇంజనీరింగ్ పూర్తయ్యాక కాంట్రాక్ట్ రంగంలో కుదురుకుని, హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తండ్రిలాగే ఆయన కూడా సహృదయుడు. హైదరాబాద్‌లో ఉన్నా స్వస్థలమైన దామరమడుగంటే ఆయనకెంతో ఇష్టం. ఆ గ్రామాభివృద్ధికి ఇప్పటికీ చంద్రమోహన్‌రెడ్డి అన్నివిధాలా చేయూతనందిస్తున్నారు. రెండవ కుమారుడు కొండా రవీంద్రరెడ్డి తండ్రి బాటలో నడుస్తూ, వ్యవసాయరంగంలో స్థిరపడ్డారు. ఏదేమైనా.. మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమలు, ముని మనుమరాళ్లతో శేషజీవితాన్ని పరిపూర్ణంగా గడిపి, 94వ ఏట పరమపదించిన పెద్దాయన కోటారెడ్డి మరణానికి చింతిస్తూ, తండ్రి మరణంతో శోకసాగరంలో మునిగిపోయిన వారి కుమారులకు, కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలుపుతోంది..'లాయర్'!.....

# వివాదరహితునికి.. ఎమ్మెల్సీ పీఠం

## స్థానిక సంస్థల స్థానానికి మేరిగ మురళి ఏకగ్రీవంగా ఎన్నిక



స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వివాదరహితునికి, మంచి నేతకు ఎమ్మెల్సీ పీఠం లభించింది. వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ తరపున స్థానిక సంస్థలకు పోటీచేసిన మేరిగ మురళీధర్ ఈ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో జిల్లా రాజకీయరంగంలో, వైకాపా వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ స్థానానికి మేరిగ మురళితో పాటు ఒక ఇండిపెండెంట్ అభ్యర్థి కూడా పోటీచేశారు. అయితే, ఆ అభ్యర్థి తగిన ధృవపత్రాలు సమర్పించక పోవడంతో ఆయన నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో మురళి ఎన్నిక ఏకగ్రీవమైంది. ఫిబ్రవరి 27వ తేది సాయంత్రం నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యులుగా మేరిగ మురళీధర్ ఎన్నికైనట్లు ప్రకటించి, ఆ మేరకు ధృవీకరణ పత్రాన్ని మేరిగ మురళికి అందజేయడంతో ఈ ఎన్నికల్లో తొలి గెలుపు ప్రకటన మురళికి దక్కినట్లయింది.

### తొలినుంచి రాజకీయ కుటుంబం :

మేరిగ మురళీధర్ ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని మండల కేంద్రమైన రాపూరులో 1969 మే నెల 23న జన్మించారు. తల్లి మేరిగ సుందరమ్మ, తండ్రి మేరిగ ఆనందరావు. తొలినుంచి వారిది రాజకీయ కుటుంబం. 1973లో గూడూరు శాసన సభ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా, 1983లో నెల్లూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన మేరిగ రామకృష్ణయ్య మురళికి పెదనాన్న. ఈ నేపథ్యంలో రాజకీయాలు ఆ కుటుంబానికి కొత్త కాదు. రాజకీయాల్లో ఉన్నా గర్వం అన్నది లేకుండా సామాన్యులతో సైతం కలివిడిగా ఉండడం మురళి ప్రత్యేకత. తనకు ఏ పదవి వచ్చినా, ఆ పదవికే వన్నె తేవడం, ఒకవేళ ఏ పదవి రాకున్నా, పార్టీకి విధేయునిగానే ఉండడం మురళి నైజం. అదే ఆయన ఉన్నతికి కారణమవుతోంది. మితభాషిగా, వివాదరహితుడుగా ఉంటూ, అటు పార్టీకి-ఇటు ప్రజలకు విశ్వసనీయమైన నేతగా, క్రమశిక్షణ పాటించే నాయకునిగా జిల్లా రాజకీయ రంగంలో ఆయన మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కూడా.

### రాజనీతిశాస్త్రంలో పీజీ :

మేరిగ మురళి ప్రాథమిక విద్య అంతా రాపూరులోని ఎస్‌పిఎల్‌సి మిషనరీ చర్చి స్కూల్‌లో సాగింది. జూనియర్ ఇంటర్మీడియేట్ వరకు రాపూరులోని సీవీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగింది. రాపూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదివారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో రాజనీతిశాస్త్రంలో పీజీ పూర్తిచేశారు. కృషితో, పట్టుదలతో ఉన్నత విద్యలు చదువుకుని విద్యావేత్తగా పేరొందారు.

### కలిసొచ్చిన అదృష్టం

మురళి రాజకీయరంగంలోకి వచ్చాక అనేక ఒడిదుడుకులు చవిచూశారు. 1984లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీచేశారు. ఆ తర్వాత, 1986 నుంచి విద్యార్థి నాయకునిగా చురుకైన పాత్రపోషించారు. 1995లో రాపూరు జడ్పీటీసీ కాంగ్రెస్ అభ్యర్థిగా ఘనవిజయం సాధించడంతో మురళికి ప్రజల్లో, రాజకీయరంగంలో మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత 2013 నుంచి 2014 వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షులుగా, 2016 నుంచి 2019 వరకు గూడూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఇన్‌చార్జిగా ఉన్నారు. వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ఓదార్పు యాత్రలో పాల్గొని, జగన్‌మోహన్‌రెడ్డికి తోడుగా నిలిచారు. అదే ఆయనకు అదృష్టంగా కలిసివచ్చింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవిలోకి వచ్చాక ఆయన ఆశీస్సులతో 2021లో మురళికి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి లభించింది. ఇప్పుడు తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్థానికసంస్థల ప్రతినిధిగా ఆయనకు వైకాపా అభ్యర్థిత్వం లభించడం, ఈ ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. స్థానిక సంస్థల్లో పార్టీకి బలం బాగానే ఉంది కనుక మురళికి ఈ ఎన్నికలు నల్లేరుమీద నడకేనని, ఆయన తప్పకుండా విజయం సాధిస్తారని అందరూ అనుకున్నదే. 'లాయర్' కూడా గత సంచికలో ఆయన విజయం తథ్యమని చెప్పింది. అదే ఇప్పుడు నిజమైంది. త్వరలోనే శాసనమండలిలో అడుగుపెట్టనున్న మేరిగ మురళికి 'లాయర్' శుభాకాంక్షలు!..

# 'పోటీ పరీక్షల'పై.. అవగాహన సదస్సు

నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో బ్రహ్మాస్ అకాడమీ మరియు విశ్వవిద్యాలయ గ్రంథాలయం, వారి ఆధ్వర్యంలో యూనివర్సిటీ విద్యార్థులకు 'పోటీ పరీక్షలు-వాటి ప్రాముఖ్యత' అనే అంశంపై ఇటీవల రెండు రోజులు పాటు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మాస్ అకాడమి డైరెక్టర్ బ్రహ్మానందరెడ్డి, యుపిఎస్‌సి, ఎపిపిఎస్‌సి, ఎన్ఎస్‌సిఆర్‌బి తదితర పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో వివరించారు. పోటీ పరీక్షలకు సంబంధించిన అన్నిరకాల ఆన్‌లైన్ మెటీరియల్ ఉచితంగా విద్యార్థులకు ఉపయోగించుకునే అవకాశాన్ని కల్పించారు. విశ్వవిద్యాలయం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య విజయానందకుమార్‌బాబు, విశ్వవిద్యాలయ గ్రంథాలయ అధికారిణి డా. వై సుధారాణి, గ్రంథాలయ సిబ్బంది కిరణ్మయి, గీత, ప్రసాద్, సురేష్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 'డైట్'లో జాతీయ సైన్స్ దినోత్సవం



ఇందుకూరుపేట మండలం పల్లిపాడులో ఉన్న ప్రభుత్వ డైట్ కళాశాలలో ఫిబ్రవరి 28న 'జాతీయ వైజ్ఞానిక దినోత్సవం' వేడుకలు నిర్వహించారు. సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 'విద్యార్థులు సైన్స్‌ను నిజజీవితంతో సమన్వయం చేసుకొంటూ అవగాహన చేసుకొంటే సులువుగా అర్థమవుతుందని' అన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన శిక్షార్థులకు ముఖ్యఅతిథి చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరిగింది. విశ్రాంత ఉపన్యాసకులు కె.రామ్మూర్తి, లెక్చరర్లు డాక్టర్ ఆర్.బాలాజీరావు, సైన్స్ ఉపన్యాసకులు కె.విజయచంద్ర, యస్.శివ, అధ్యాపకులు బి.దశరథరామిరెడ్డి, యస్.బోయదాస్, పి.అల్తాఫ్, జులేఖాబి, డి.నరసింగరావు, కే.షఫీ అహ్మద్, యస్.నరసింహమూర్తి, సి.సోమేశ్వర్ పాల్గొన్నారు.

# న్యాయవిద్యలో టాపర్‌కు.. గోల్డ్‌మెడల్

న్యాయవిద్యకు తలమానికమైన నల్సార్ యూనివర్సిటీ (హైదరాబాద్) 19వ వార్షిక స్నాతకోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 25న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ వై.వి.చంద్రచూడ్ పాల్గొని వివిధ కోర్సులలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. అందులో, మన నెల్లూరు వాస్తవ్యులైన మోపూర్ ప్రసాద్, వారి తండ్రి స్వర్గీయ మోపూరు సుందరరామయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన గోల్డ్ మెడల్‌ని ఏవియేషన్ లా కోర్సులో టాపర్ అయిన అభయ్ ఆనంద్ పాటిల్‌కి డాక్టర్ వై.వి. చంద్రచూడ్ అందజేయడం విశేషం!

# నెల్లూరు కబుర్లు

## ఓటుహక్కును వినియోగించుకోండి

**- కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు**



శాసనమండలి ద్వైవార్షిక ఎన్నికలకు ఓటర్లుగా నమోదు చేసుకున్న పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కెవియన్ చక్రధర్ బాబు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 27న నెల్లూరులోని విఆర్ పీజీ కాలేజీలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 13న శాసనమండలికి జరిగే ద్వైవార్షిక ఎన్నికలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు సజావుగా పూర్తిచేశామన్నారు. పోలింగ్ ప్రక్రియలో కీలకపాత్ర వహించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులుగా జిల్లాలోని సీనియర్ అధికారులను నియమించామన్నారు. వీరికి రెండు విడతలుగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. 'నుడా' వీసీ బాపిరెడ్డి, డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డి, ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## యువత పరిశోధనలపై దృష్టి సారించాలి

ఎంతోమంది శాస్త్రవేత్తలు తమ పరిశోధనల ప్రతిభ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపజేశారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత పరిశోధనలపై దృష్టి సారించాల్సిన అవసరం వుందని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ఫిబ్రవరి 28న నెల్లూరులోని జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో హౌస్‌సర్జన్ విద్యార్థులకు ఏర్పాటుచేసిన ఓరియంటేషన్ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, నాలుగున్నర సంవత్సరాలుగా వైద్య విద్యను అభ్యసించి నేడు ప్రాక్టికల్‌గా వైద్య విద్యను నేర్చుకునేందుకు హౌస్ సర్జన్‌షిప్ లోకి అడుగిడుతున్న వైద్య విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. హౌస్ సర్జన్ విద్యార్థులకు కొన్ని పరిమితులు ఉంటాయని, వాటికి లోబడి సీనియర్ వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేయాలన్నారు. ఇప్పటి నుండే ప్రతి వైద్య విద్యార్థి నిర్దిష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని, వైద్య విద్య పూర్తయిన తరువాత వైద్యులుగా పేదలకు వైద్యం అందించడంలో కృషి చేస్తూ వైద్య కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. శిద్దా నాయక్, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ విజయభాస్కర్, ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ కో-ఆర్డినేటర్ సునంద, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## సామాజిక పింఛన్ల పంపిణీ

ప్రతినెలా అందజేస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా మార్చి 1 నుంచి పింఛన్లను పంపిణీ చేస్తున్నామని డిఆర్‌డిఏ పీడీ కెవి సాంబశివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 3,11,157 మందికి 86.43 కోట్ల రూపాయలను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.



## నెల్లూరులో..అసెంబ్లీ స్పీకర్

రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారామ్ ఫిబ్రవరి 28 మంగళవారం నాడు తిరుపతికి వెళ్తూ, మార్గం మధ్యంలో నెల్లూరులోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు సిబ్బంది ఆయనకు గౌరవ వందనం చేశారు. నెల్లూరు ఆర్డీఓ మలోల ఆయన్ను గౌరవపూర్వకంగా కలుసుకున్నారు.

## విఎస్‌యులో.. జాతీయ సైన్స్ డే




నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జాతీయ సైన్స్‌డేని పురస్కరించుకొని ఫిబ్రవరి 28న విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి ముఖ్యఅతిథిగా పాల్గొని ఘనంగా వేడుకలు ప్రారంభించారు. విశిష్ట అతిథిగా ఐ.ఐ.ఎస్.ఇ.ఆర్ (తిరుపతి)కి చెందిన రసాయన శాస్త్ర విభాగపు సహాయ ఆచార్యులు డాక్టర్ పి కిరణ్‌కుమార్ పాల్గొని 'క్యాన్సర్ నిర్మూలనలో నేచురల్ ప్రొడక్ట్స్ ప్రాధాన్యత'ను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి విజయ్ ఆనంద్‌కుమార్ బాబు పాల్గొని జాతీయ సైన్స్ దినోత్సవం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం, వ్యాసరచన మరియు వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. విఎస్‌యు రిజిస్ట్రార్ ఆచార్య పి. రామచంద్రారెడ్డి, అధ్యాపకులు డాక్టర్ వి.అనిల్‌కుమార్, డాక్టర్ ఏ.ప్రవీణ్‌కుమార్, డాక్టర్ జి.నాగరాజు, జాన్ పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు

### కొండాయపాలెం పాఠశాలలో..



నెల్లూరులోని కొండాయపాలెంలో ఉన్న నగర పాలక ప్రాథమిక పాఠశాలలో ఫిబ్రవరి 28న ఘనంగా సైన్స్ డే నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు 40 ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషారాణి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వాటర్ రీ సైక్లింగ్ ప్రాజెక్ట్ రూపొందించిన ఆదర్శ్‌కు మొదటి బహుమతి, బెలూన్ కారు తయారుచేసిన విష్ణుకు రెండవ బహుమతి, రెయిన్ వాటర్ స్టోరేజ్ ప్రాజెక్ట్ చేసిన మనస్వికి మూడవ బహుమతి లభించాయి. ఉపాధ్యాయులు హరీష్, సంధ్యారాణి,మాధవి మరియు వాలంటీర్లు పాల్గొన్నారు.

## రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు

### 7న బంగారు గరుడసేవ, 9న రథోత్సవం



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. నెల్లూరు రంగనాయకులపేటలో కొలువై వున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవాలయంలో మార్చి 2 నుంచి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయం విద్యుద్దీపకాంతులతో దేదీప్యమానంగా ఉంది. గురువారం సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. శుక్రవారం ధ్వజారోహణం జరిగింది. రాత్రికి శేషవాహనోత్సవం నిర్వహించారు. మార్చి 4వ తేది ఉదయం సూర్యప్రభ, రాత్రికి హంసవాహనోత్సవాలు జరుగనున్నాయి. అదేవిధంగా 5న సింహవాహనం, చంద్రప్రభ వాహనం, 6న పల్లకి ఉత్సవం, హనుమంతసేవ, 7న మోహినీ అవతారం, బంగారు గరుడసేవ, పూలంగిసేవ, 8న పూలంగిసేవ, కల్యాణోత్సవం, గజవాహన సేవ జరుగుతాయి. 9వ తేది ఉదయం 8.30 గంటల నుంచి అత్యంత వైభవోపేతంగా రథోత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామికి పుష్పాలంకారం, రాత్రికి రంగనాథస్వామికి పొన్నవాహనోత్సవం నిర్వహిస్తారు. 10వ తేదీన తిరుప్పావ్‌న్దాదల్, అశ్వవాహ నోత్సవం, 11న ప్రణయ కలహోత్సవం (ముసుగుల సేవ), చక్రస్నానం, పుణ్యకోటి విమానం, 12న పుష్పయాగం, దవనోత్సవం తర్వాత రాత్రి 11 గంటలకు ధ్వజావరోహణం జరుగుతుంది. 13వ తేది రాత్రి 7 గంటల నుంచి కనువిందుగా స్వామివారికి, అమ్మవార్లకు తెప్పోత్సవం నిర్వహిస్తారు.

## కుట్టు శిక్షకులకు సన్మానం




నెల్లూరు రెడ్‌క్రాస్ ఛైర్మన్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ టైలర్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 28న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ-జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో కుట్టు శిక్షణ ఇస్తున్న పావని, వసుంధరలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు పి.సురేష్‌కుమార్ జైన్, దాసరి రాజేంద్ర ప్రసాద్, మేనేజింగ్ కమిటీ సభ్యులు పి.గురునాథరావు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు. మహిళలు నెల్లూరులోని కూరగాయల మార్కెట్ దగ్గరలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణా తరగతులలో చేరి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, అనంతరం స్వతంత్ర జీవనోపాధి కోసం రెడ్‌క్రాస్ వారు అందిస్తున్న సహాయ సహకారాలను వినియోగించుకోవాలని వారు కోరారు.

### మార్చి 7న అష్టలక్ష్మి ఆలయంలో..

## లక్ష్మీ జయంతి మహోత్సవాలు

నెల్లూరు దుర్గామిట్ట సుజాతమ్మ కాలనీలోని శ్రీ కృష్ణ యోగమందిర ప్రాంగణంలోని అష్టలక్ష్మీ మందిరంలో శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి అవధూత దత్తపీఠం ఆధ్వర్యంలో మార్చి 7న అత్యంత విశేషమైన లక్ష్మీ జయంతి మహోత్సవాలు జరుగుతాయని, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 7వ తేదీ, మంగళవారం ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా ఆ విశిష్టమైన రోజున ఉదయం 7గంటలకు స్వర్ణ మహాలక్ష్మీదేవికి పంచామృతాభిషేకం, 8గంటలకు ఉత్సవమూర్తికి కనకాభిషేకం, 9.30గంటలకు లక్ష కుంకుమార్చన భక్తులచే నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం 10.30గంటలకు రుద్రహోమం, 11.30 గంటలకు అష్టలక్ష్మి హోమం జరుగుతాయని, ఆ తర్వాత భక్తులందరికీ ప్రసాదం వితరణ జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 7గంటలకు స్వర్ణ మహాలక్ష్మీ అమ్మవారికి పల్లకి సేవ ఎంతో వేడుకగా జరుగుతుందని, కనుక భక్తులంతా విచ్చేసి లక్ష్మీదేవి అమ్మవారి కృపా కటాక్షాలకు పాత్రులు కావాలని ఆయన కోరారు. వివరాలకు మందిర కార్యాలయం ఫోన్ నెం. 9441548655 లేదా 08613500294లకు సంప్రదించాలని ఆయన సూచించారు.






## 17 వరకు.. రేషన్ సరకులు

జిల్లాలోని 7.22 లక్షల మంది రేషన్‌కార్డుదారులకు మార్చి 1 నుంచి 17వ తేది వరకు రేషన్ సరుకులను పంపిణీచేస్తున్నామని డిఎస్ఓ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు వాహనాల ద్వారా సరుకుల పంపిణీ ఉంటుందని, రేషన్‌కార్డులోని ఒక్కో సభ్యునికి ఉచితంగా 5 కేజీల బియ్యం ఇస్తున్నామని, 67 రూపాయలకు కేజీ కందిపప్పు, 17 రూపాయలకు అరకేజీ పంచదార పంపిణీ చేయిస్తున్నామని తెలిపారు. అంత్యోదయ అన్న యోజన కార్డుదారులకు కార్డుకు 35 కిలోల బియ్యం ఉచితంగా, ఒక కిలో కందిపప్పు రూ.67కి, కేజీ పంచదార రూ. 13.50కి అందజేస్తున్నామన్నారు.

# ప్రజా ప్రతినిధులు ప్రజల్లోకి వెళ్లాలి

## - ఎంపీ ఆదాల పిలుపు



కార్పొరేటర్లు, వైసీపీ కార్యకర్తలు, గృహసారథులు ప్రజల్లోకి ముమ్మరంగా వెళ్లాలని, ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, రాష్ట్రం కోసం చేస్తున్న అభివృద్ధిని వివరించాలని నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల నెల్లూరులోని 21, 22, 23 డివిజన్ల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ కార్యక్రమం పడారుపల్లిలోని ఏఎన్ఆర్ కల్యాణమండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ ఆదాల మాట్లాడుతూ, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు తెలియజేసినప్పుడే ప్రజలు ప్రభుత్వం పట్ల, పార్టీ పట్ల ఆదరణ చూపుతారని, తద్వారా ఏ ఎన్నికలొచ్చినా విజయం మన సొంతమవుతుందని తెలిపారు. రాజకీయ నేతలను, పథకాల పంపిణీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం కోసమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం తలపెట్టారని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ అధ్యక్షులు ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ రంగారెడ్డి, జడ్పీటీసి మల్లు సుధాకర్‌రెడ్డి, స్వర్ణ వెంకయ్య, నవీన్‌కుమార్‌రెడ్డి, అవినాష్, సుధాకర్ యాదవ్, దాసరి రాజేష్, పిండి సురేష్, ఆర్.ఎస్.ఆర్, నూనె మల్లికార్జున యాదవ్, బొబ్బల శ్రీనివాసయాదవ్, మూల విజయభాస్కర్ రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, సన్నపురెడ్డి పెంచల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మొయిళ్ళ గౌరీ, నరసింహులు గౌడ్, మేఘనాథ్‌సింగ్, అబూబకర్, ఏసు నాయుడు, అల్లా బక్షు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైసీపీ అభిమానులు పాల్గొన్నారు.

### వీలైనంత త్వరగా ఇళ్ల పట్టాలు ఇప్పిస్తాం

నారాయణరెడ్డిపేట, కోడూరుపాడు ప్రాంతాల వారికి వీలైనంత త్వరగా పట్టాలిప్పిస్తామని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి హామీ ఇచ్చారు. సీనియర్ వైసీపీ నేత లచ్చారెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 100 మంది నారాయణరెడ్డిపేట, కోడూరుపాడు ప్రాంతాల నుంచి ఇటీవల ఆదాల నివాసానికి వచ్చారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీ ఆదాల మాట్లాడుతూ వీలైనంత త్వరగా అక్కడ పర్యటించి వివాదాలు లేని స్థలాన్ని పరిశీలించి, పట్టాలుగా పంపిణీ చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. విజయ డెయిరీ ఛైర్మెన్ రంగారెడ్డి, నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు నాగరాజు, మేకల రామ్మోహన్ యాదవ్, అంజిరెడ్డి, సుధాకర్ యాదవ్, స్వర్ణ వెంకయ్య, నాగారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పేర్నేటి కోటేశ్వర్ రెడ్డి, అల్లా బక్షు తదితరులు పాల్గొన్నారు.



# పార్టీ సమావేశాల్లో బిఎంఆర్.. బిజీబిజీ!

## • నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం

వైకాపా నాయకుడు, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బిఎంఆర్) ఇటీవల ప్రకాశం జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పర్యటించి పార్టీ పటిష్ఠతకు పలు సూచనలు చేశారు. అమరావతిలో జరిగిన పెదకూరపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ సమా వేశంలో పాల్గొన్న బీద మస్తాన్‌రావు, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు పైల సోమినాయుడు తదితరులతో కలసి నియోజకవర్గ సమస్యలను చర్చించారు. సమస్యల పరిష్కారానికి కృషిచేశారు. అదేవిధంగా, వినుకొండలో జరిగిన వినుకొండ నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ సమావేశంలో స్థానిక శాసన సభ్యులు బొల్ల బ్రహ్మనాయుడుతో కలసి పాల్గొన్నారు. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ పటిష్ఠతకు కార్యకర్తలకు సూచనలు చేశారు. తదుపరి వినుకొండ చుట్టుపక్కల ఉన్న 20 పంచాయ తీలలో ఉన్న నీటి సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపే రూ. 12.50 కోట్ల ప్రతిపాదనలపై శాసనసభ్యులు బ్రహ్మనాయుడు ఈ సందర్భంగా బీద మస్తాన్‌రావుకు వివరించారు. కనిగిరిలో ఇటీవల జరిగిన కనిగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ సమావేశంలో బిఎంఆర్ పాల్గొని, నాయకులు, కార్యకర్తలకు దిశానిర్ధేశం చేశారు. స్థానిక శాసనసభ్యులు బుర్రా మధుసూధన్‌యాదవ్, భూమన కరుణాకర్ రెడ్డి, ప్రకాశం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, కనిగిరి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేదగిరీశుని ఆలయానికి..లక్ష విరాళం

నెల్లూరు సమీపంలోని నరసింహకొండపై వెలసివున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి నెల్లూరుకు చెందిన బండి లక్ష్మీరామకిషోర్‌రెడ్డి కుటుంబసభ్యులు ఫిబ్రవరి 25న లక్ష రూపాయలను వితరణగా సమర్పించుకున్నారు. ఆలయంలో నిత్యాన్నదానానికి వినియోగించాల్సిందిగా దాతలు కోరుతూ, ఆ మొత్తాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

## డిఎస్ఆర్ ట్రస్ట్‌లో..

# విజయవంతంగా 'మెగా రక్తదాన శిబిరం'



దివంగత దేవిరెడ్డి శారదమ్మ 6వ వర్ధంతిని పురస్కరించుకుని ఫిబ్రవరి 26న అల్లూరు మండలం నార్త్‌మోపూరు గ్రామంలో ఇందుపూరు క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న డిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వారు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరంలో పెద్దసంఖ్యలో యువత తరలివచ్చి రక్తదానం చేశారు. అల్లూరు పరిసరగ్రామాల నుంచి సుమారు 75మంది ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేయడం విశేషం. నెల్లూరు రెడ్‌క్రాస్ వారి సహకారంతో నిర్వహించిన ఈ 'మెగా రక్తదాన శిబిరం' విజయవంతమైనందుకు డిఎస్ఆర్ ట్రస్ట్ ట్రస్టీ దశరథరామిరెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్‌లో పనిచేస్తున్న సిబ్బందికి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవిరెడ్డి కుటుంబసభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, ట్రస్ట్ మేనేజర్ అనీల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దేవిరెడ్డి శారద ఉన్నత పాఠశాలలో.. సైన్స్ దినోత్సవం



అల్లూరు మండలం నార్త్‌మోపూరులోని దేవిరెడ్డి శారద ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని "అకడమిక్ ఫేర్" కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. అల్లూరు మండల తహసీల్దార్ రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు, దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సైన్స్ దినోత్సవం ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ప్రాజెక్టులను ప్రదర్శించగా, ఆ విద్యార్థులను అందరూ అభినందించారు. బండ్ల రవీంద్ర, కొప్పు శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ రమణప్రసాద్ జడ్జిలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ట్రస్ట్ ఛైర్మెన్ దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ట్రస్ట్ మేనేజర్ అనీల్‌కుమార్‌రెడ్డి, పెద్దసంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# 'తంగిరాల మహాభారతం' 44వ భాగం

పాండవులు ఏకచక్రపురంలో ఒక బ్రాహ్మణుని ఇంట్లో బస చేస్తారు. నార బట్టలు కట్టుకుని, ఇంటింటికి తిరుగుతూ బిచ్చమెత్తుకుంటుంటారు. వాళ్ళు తెచ్చిన అన్నాన్ని రెండు భాగాలు చేసి, ఒకటి భీముడికి పెట్టి మిగతా దాంట్లో మిగతావాళ్ళు తింటారు. ఒకరోజు భీముడు బిక్షాటనకి వెళ్ళాడు. ఆరోజు ఆ ఇంట్లోంచి పెద్దపెద్దగా ఏడుపులు వినబడతాయి. కుంతీ వెళ్లి చూసినప్పుడు, బ్రాహ్మణుడు, అతని భార్య, కూతురు, కొడుకు తామంటే తాము వెళతామని వాదించుకుంటుంటారు. కుంతీ ఎందుకిలా ఏడుస్తున్నారని అడిగినప్పుడు, ఆ బ్రాహ్మణుడు చెప్తాడు... ఏకచక్రపురానికి సమీపంలో ఒక రాక్షసుడికి ప్రతిరోజూ ఒక ఇంటి నుంచి ఒక మనిషి, రెండు ఆంబోతులు, బండెడు ఆహారం సమర్పించాలని, ఈరోజు తమవంతు వచ్చిందని విలపిస్తాడు. అప్పుడు కుంతీ, బాధ పడొద్దని, తనకు ఐదుగురు కుమారులని, వాళ్ళలో ఒకణ్ణి పంపుతానని అభయమిస్తుంది. భీమునితో మనకు ఆశ్రయమిచ్చిన వారికి సహాయం చెయ్యాలని చెప్పినప్పుడు అంగీకరిస్తాడు. ఆ బ్రాహ్మణుడు, ఒక బండి నిండా ఆహారంపెట్టి వివిధ పిండి వంటలతో నింపుతాడు. భీముడు ఆ బండి ఎక్కి యమునా నదీ తీరంకి వెళ్లి, బకాసురుణ్ణి పిలిచి, వాడు వచ్చేలోపు ఆహారమంతా




తింటుంటాడు. బకాసురుడుకి కోపం వచ్చి భీమునితో పోరాటానికి దిగుతాడు. ఆ మల్లయుద్ధంలో భీముడు బకాసురుణ్ణి సంహరిస్తాడు. ఏకచక్ర అగ్రహార బ్రాహ్మణులంతా ఆనందంతో పాండవులని ఆశీర్వదిస్తారు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.




# మత్తుపదార్థాలతో జాగ్రత్త!

## ఎన్‌బికెఆర్‌లో విద్యార్థులకు 'సెబ్' అధికారుల అవగాహన




మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల వంటివి ఆరోగ్యాన్ని, జీవితాలను నాశనం చేస్తాయని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వాటి జోలికి వెళ్లవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు ఇటీవల కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి విద్యార్థులకు హితవు పలికారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. చట్టపరమైన విజ్ఞానాన్ని కూడా విద్యార్థులు కలిగివుండాలని, అసాంఘిక కార్యక్రమాలకు, చట్ట విరుద్ధమైన పనులకు దూరంగా ఉండాలని చెప్పారు. ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయిలో రాణించాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో గూడూరు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.జానకిరామ్, వాకాడు సెబ్ సిఐ పి.ప్రసన్నలక్ష్మి, పలు విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెండవ సెమిస్టర్ ప్రారంభం

విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు ముగిసి రెండవ సెమిస్టర్ తరగతులు ప్రారంభం అయ్యాయని కళాశాల డైరెక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. మొదటి సెమిస్టర్ చివరలో జరిగిన పరీక్షలను విద్యార్థులందరూ వ్రాయడం జరిగిందని, ఈ విషయంలో ఇటీవల కొన్ని పత్రికలలో వచ్చిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, రాజకీయ కారణాలతో కళాశాలపై దుష్ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదని ఆయన పేర్కొన్నారు.

## ఫ్లయింగ్‌స్క్వాడ్ సిద్ధం

జిల్లాలో మార్చి 13వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శక సూత్రాల ప్రకారం నగదు, మద్యం తరలింపు, ఇతర వస్తువుల పంపిణీ జరగకుండా, పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. కందుకూరు, కావలి, ఆత్మకూరు, నెల్లూరు డివిజన్ల వారీగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. ఈ బృందాలు జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా నిరంతరం పర్యవేక్షిస్తుంటాయి. అలాగే మద్యం, నగదు, ఇతర వస్తువుల తరలింపు, పంపిణీపై అందిన ఫిర్యాదులను నమోదు చేసి, సరైన ఆధార పత్రాలు లేని నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్‌చేసే అధికారం ఈ బృందాలు కలిగి ఉంటాయి. ఎప్పటికప్పుడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో పర్యటిస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే అంశాలపై గట్టిగా నిఘా ఉంచి, ఎవరైనా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఉల్లంఘించినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు జిల్లా ఎన్నికల అధికారికి ఈ బృందాలు సిఫార్సు చేస్తాయి.

## ప్రసన్నను కలిసిన మేరిగ మురళి



ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం మేరిగ మురళి కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డిని నెల్లూరులోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కని బహుకరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కోవూరు మండలంలో జరిగిన గృహసారథుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మేరిగ మురళిని ఎమ్మెల్యే ప్రసన్న, పలువురు కార్యకర్తలు, అభిమానులు గజమాలతో, మరియు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## జిల్లా వైకాపా యువజన అధ్యక్షులుగా.. సుధీర్‌కుమార్‌రెడ్డి

మహానేత స్వర్గీయ వైయస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి నమ్మినబంటుగా, జగనన్నకు సైనికుడిగా పనిచేస్తున్న మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి నెల్లూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షులుగా వైకాపా అధిష్టానం నియమించింది. గతంలో నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుతం సూళ్లూరుపేట నియోజకవర్గ పార్టీ పరిశీలకులుగా ఉన్న సుధీర్‌కుమార్, ఇప్పుడు నెల్లూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షులుగా నియమితులైనందుకు ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షునిగా తనను నియమించిన జగనన్నకు, సహకరించిన నాయకులకు సుధీర్‌కుమార్ ఒక ప్రకటనలో తన కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో జిల్లాలోని యువతను ప్రోత్సహిస్తూ జగనన్న కలలను సాకారం చేస్తూ అన్ని నియోజకవర్గాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపుకు యువకులందరితో కలిసి తనవంతు కష్టపడి పనిచేస్తానని ఆయన తెలిపారు.

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి



గూడూరు, బ్రాహ్మణవీధిలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఇటీవల జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ భారతీయ శాస్త్ర విజ్ఞానాన్ని ప్రపంచానికి చాటి నోబెల్ బహుమతి పొందిన గొప్ప శాస్త్రవేత్త సివి రామన్ అని, ఆయన 'రామన్ ఎఫెక్టు' కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకోవడం జరుగుతోందన్నారు. భారతదేశం సాంకేతికంగా ముందుకు వెళ్లాలంటే విద్యార్థులు నైపుణ్య విలువలు పెంపొందించుకోవాలని, సైన్స్ పట్ల మక్కువ చూపి అనేక ప్రయోగాలు, నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన నమూనాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## దయాకర్‌రెడ్డిని గెలిపించండి



భారతీయ జనతాపార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిని గెలిపించాలంటూ ఆ పార్టీ గూడూరు అర్బన్ మండల అధ్యక్షులు బాలకృష్ణనాయుడు గూడూరు పట్టణంలోని బజారువీధి, కుమ్మరి వీధిలోని గ్రాడ్యుయేట్లను కోరారు. దయాకర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి గుంజి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఐ.సురేష్‌బాబు పాల్గొన్నారు.

### శాసన మండలికి మేరిగ...

## స్థానిక నినాదంతో తెరపైకి బత్తిని



రాష్ట్రంలోనే గూడూరు అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. 2019 ఎన్నికల్లో పాలకపక్ష ఎమ్మెల్యేని కాదని, వైకాపా అభ్యర్థిని గెలిపించి గూడూరు ప్రజలు తమ ప్రత్యేకతను చాటుకున్నారు. వై.ఎస్.జగన్ చరిష్మాతో ఆ ఎన్నికల్లో వైకాపా విజయవిహారం చేసింది. 2014 ఎన్నికల్లో వైకాపా తరఫున బరిలోకి నిలిచి గెలిచిన పాశం సునీల్‌కుమార్, ప్రతిపక్ష పార్టీలో ఉంటే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడం లేదంటూ అప్పుడు అధికారంలో ఉన్న టిడిపి గూటికి చేరుకున్నాడు. 2019 ఎన్నికల్లో టిడిపి తరపునే పోటీ చేసి జగన్ హవా ముందు ఓటమి చవిచూడక తప్పలేదు. అయితే ఇప్పటికీ తెలుగుదేశం తరపున బలమైన అభ్యర్థిగా పాశం ఉన్నాడు. వైకాపాకు గట్టి అభ్యర్థిగా మేరిగ మురళీ ఉన్నప్పటికీ, ఆయన శాసన మండలికి వెళ్ళడంతో ఇప్పుడు గూడూరులో స్థానిక నినాదం తెరపైకి వస్తోంది. ప్రస్తుత ఎమ్మెల్యే గాని, మేరిగ మురళీ గాని స్థానికేతరులు కావడంతో వైకాపా కార్యకర్తల్లో స్థానిక నినాదం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఈ కోవలో చూస్తే వైకాపా కార్యకర్తలు, గూడూరు ప్రజానీకం స్థానికంగా పార్టీనే నమ్ముకుని, వైసిపి ఆవిర్భావం నుండి పనిచేస్తున్న బత్తిని విజయకుమార్ వైపు చూస్తున్నట్లు సమాచారం. బత్తిని 2014లోనే వైకాపా టిక్కెట్ ఆశించినా, అధిష్టానం పాశం సునీల్ వైపే మొగ్గు చూపింది. బత్తిని విజయకుమార్ 2011లో గడపగడపకు వైఎస్సార్ పార్టీ అనే నినాదంతో వాకాడు, కోట, చిల్లకూరు, గూడూరు తదితర మండలాలలోని గ్రామాలను సందర్శించాడు. జగన్‌తో కలసి పాదయాత్రలో కూడా నడిచారు. అప్పటి నుంచి స్థానిక నాయకుడిగా వైకాపాలోనే కొనసాగుతున్నాడు. ఇప్పుడు మేరిగ మురళీ శాసనమండలికి ఎన్నికవడంతో బత్తిని అభ్యర్థిత్వాన్ని అధిష్టానం నిర్ణయిస్తుందని గూడూరు నియోజకవర్గ వైకాపా కార్యకర్తలు ఆశిస్తున్నట్లు సమాచారం.



ఫిబ్రవరి 28వ తేదీ రేణిగుంట, కుర్రకాలువ గ్రామంలోని బ్లైండ్ క్రాస్ ఫౌండేషన్‌కు ఐదువేల రూపాయల ఆర్థిక సాయం అందజేస్తున్న గూడూరు రూరల్ సి.ఐ జి.దశరథరామారావు



## అళఘునాథస్వామి బ్రహ్మోత్సవాలు

గూడూరు పట్టణంలోని శ్రీశ్రీశ్రీ అళఘునాథస్వామి దేవస్థానం నందు స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 2న వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 12వతేదీ వరకు ఈ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామి-అమ్మవార్ల తీర్థప్రసాదాలు స్వీకరించి శ్రీవారి కృపకు పాత్రులు కావాలని దేవస్థాన కమిటీ ఓ ప్రకటనలో కోరింది.

## దివ్యాంగులకు పలసరుకులు



గూడూరు రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల డిఎన్‌ఆర్ కమ్యూనిటీ హాల్‌లో 16మంది దివ్యాంగులకు పల సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా మూలి హరినాథ్‌రెడ్డి వ్యవహరించగా, రోటరీ ప్రెసిడెంట్ ధనుంజయరెడ్డి, సెక్రటరీ విజయభాస్కర్‌రెడ్డి, రామ్మోహన్ రావు, సిద్ధారెడ్డి సనత్‌కుమార్‌రెడ్డి, వాసు గౌడ్, బలరాంరెడ్డి, సూర్య సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# తోడేరు..కన్నీరుమున్నీరు

- పడవ మునిగింది.. శోకమే మిగిలింది
- ఆరుగురి ప్రాణాలు తోడేసిన తోడేరు
- విషాదంగా ముగిసిన విహారం
- మనవడు చనిపోయాడని.. అమ్మమ్మ గుండె ఆగిపోయింది




**సరదాగా చెరువులో పడవ షికారుకు వెళ్ళిన ఆ స్నేహితుల బృందానికి, మృత్యువు ఎదురొచ్చింది. అందినవారిని అందినట్లుగా పొట్టనపెట్టుకుంది. పదిమంది పడవెక్కి హాయిగా నవ్వుకుంటూ చెరువులో వెళ్తుండగా విధి వికటించింది. మధ్యలో పడవ మునిగిపోయింది. ఆరుగురు గల్లంతయ్యారు. వారెలాగైనా బతికే ఉంటారని ఆశలు పెట్టుకున్న వారంతా హతాశులయ్యేవిధంగా, ఆరుగురూ మునిగిపోయి ప్రాణాలు కోల్పోవడం దారుణం. దీంతో తోడేరు కన్నీరుమున్నీరైంది. చెరువంతా గాలించి ఒక్కొక్కరి మృతదేహాలను వెలికితీస్తుంటే, ఆ బిడ్డల తల్లితండ్రుల గుండె చెరువైంది. వారి ఆక్రందనలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది. ఆ విషాదానికి ఆ గ్రామమే కాదు, జిల్లా అంతా చలించిపోయింది.**

పొదలకూరు మండలం తోడేరు గ్రామానికి చెందిన స్నేహితులు.. పదిమంది పాతికేళ్ళలోపు వయసున్న యువకులు, గ్రామంలోని కొత్తచెరువులో ఫిబ్రవరి 26 ఆదివారం రోజున చేపలకు మేతవేసే ఓ చిన్న నాటు పడవపై సరదాగా విహారానికి బయలుదేరారు. దురదృష్టవశాత్తూ చెరువులో ఆ పడవ అదుపుతప్పి బోల్తా పడిపోయింది. ఈ దుర్ఘటనలో నలుగురు ఈదుకుంటూ ప్రాణాలతో బయటపడ్డారు. ఆరుగురు గల్లంతయ్యారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే మంత్రి కాకాణి, జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, జిల్లా ఎస్పీ విజయారావు తదితరులంతా హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్ళు రాత్రంతా వెదికినా కనిపించకపోవడంతో, తల్లితండ్రుల రోదన అంతా ఇంతా కాదు. దుర్మరణం పాలైన ఆ యువకుల మృతదేహాలను సోమవారం వెలికితీశారు.





ఈ దుర్ఘటనలో చల్లా ప్రశాంత్‌కుమార్, మన్నూరు కల్యాణ్, అల్లి శ్రీనాథ్, పముజుల బాలాజీ, బి.రఘు, పాటి సురేంద్ర అనే యువకులు మృతిచెందారు. వీరంతా తోడేరులో ఒకే వీధిలో ఉండేవారు. మంచి స్నేహితులు. వారి కుటుంబాలకు వారే మగబిడ్డలు, ఆ కుటుంబాలకు వారే పంచప్రాణాలు. ఈ దుర్ఘటనలో వారు చనిపోవడం ఆ కుటుంబాల్లో చీకటి కమ్మేసినట్లయింది. వారి తల్లితండ్రుల బాధ వర్ణనాతీతం. మృతుల కుటుంబాల వేదన హృదయవిదారకం.

### ఒక్కొక్కరిదీ ఒక్కో విషాదగాథ :

మరణించిన ఆ ఆరుగురిలో ఒక్కొక్కరిదీ ఒక్కో విషాదగాథ. వారిలో ఒకరు ప్రశాంత్‌కుమార్. ఇన్ఫోసిస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా వర్క్ ఫ్రం హోంలో ఉన్నాడు. నెలకు లక్షా30వేల దాకా జీతం. తండ్రి లేని ప్రశాంత్‌కు తల్లి, చెల్లి ఉన్నారు. ఈ దుర్ఘటనలో ప్రశాంత్ మృతి ఆ కుటుంబాన్ని విషాదంలో ముంచింది. ప్రశాంత్ మరణించాడని తెలియడంతోనే బుచ్చిరెడ్డిపాళెంలో ఉంటున్న ప్రశాంత్ అమ్మమ్మ రమణమ్మ గుండె ఆగి మరణించడం మరో విషాదం.

అదేవిధంగా, మరో యువకుడు కల్యాణ్ మేనమామ కుమార్తెను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. వారికి ఇద్దరు చిన్నపిల్లలున్నారు. కల్యాణ్ కన్నుమూతతో భార్యాబిడ్డల శోకం అంతా ఇంతా కాదు. ఇంకో యువకుడు శ్రీనాథ్, ఇంటర్ చదువుతున్నాడు. కోవూరులో ఇంజనీరింగ్ చదువుతున్న బాలాజీ, ఆ తల్లితండ్రులకు ఏకైక సంతానం. పొదలకూరు కోఆపరేటివ్ బ్యాంకులో మెసెంజర్‌గా పనిచేస్తూ, అనారోగ్యంతో ఉన్న తల్లిని చూసుకుంటున్న రఘు ఈ ప్రమాదంలో దుర్మరణం చెందాడు. రఘుకు తండ్రి లేడు. వీరిది నిరుపేద కుటుంబం. మరొక యువకుడు సురేంద్ర, ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సంతోషంగా షికారుకు వెళ్ళి, శవాలుగా బిడ్డలు తిరిగిరావడంతో..ఆ ఘోరానికి మృతుల తల్లితండ్రులు, బంధువులు, కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు.



## కనిగిరి రిజర్వాయర్‌ను పరిరక్షించాలి

### బిజెపి నేత మిడతల వినతి

కనిగిరి రిజర్వాయర్ నుండి వస్తున్న సీపేజీని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. జల వనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీరు కృష్ణమోహన్‌కు ఆమేరకు ఇటీవల ఒక వినతిపత్రం సమర్పించారు. కనిగిరి రిజర్వాయర్‌కు ఉత్తరభాగాన రక్షణ కట్టగా ఉన్న తిప్పను గ్రావెల్ తవ్వకాల కోసం మూడు సంవత్సరాలుగా ధ్వంసం చేయడంతో కనిగిరి రిజర్వాయర్ ఉనికికే ప్రమాదం ఏర్పడిందని రమేష్ వివరించారు.. రిజర్వాయర్ రక్షణ కొరకు మైనింగ్ నిలిపివేయాలని ప్రభుత్వఅధికారులందరికీ విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని, వాస్తవానికి మైనింగ్ మాఫియా 20 లక్షల క్యూబిక్ మీటర్లు మేర గ్రావెల్ తవ్వకాలు చేస్తే మైనింగ్ శాఖ రెండు లక్షల క్యూబిక్ మీటర్లు మాత్రమే గ్రావెల్ తవ్వకాలు జరిపినట్లు మోసపూరిత నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో దాంగేనాయుడు, చిలకా ప్రవీణ్, కటకం చైతన్య, తిరివీధి నారాయణరావు, పెంచలసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి అభ్యర్థి శ్రీకాంత్‌ను గెలిపించండి

### మాజీమంత్రి సోమిరెడ్డి విజ్ఞప్తి



రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కంచర్ల శ్రీకాంత్‌ను గెలిపించాలని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 27న ఆయన నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీవర్గాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మంచి వ్యక్తిత్వం ఉన్న శ్రీకాంత్‌ను గెలిపిస్తే నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆయన చిత్తశుద్ధితో కృషిచేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో అభ్యర్థి శ్రీకాంత్‌తో పాటు, పరిశీలకులు గుంటుపల్లి నాగేశ్వరరావు, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే వెంకటేష్, దామచర్ల సత్య, టిడిపి నాయకులు అబ్దుల్‌అజీజ్, కోటంరెడ్డి శీనయ్య, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, మహిళా నాయకురాళ్ళు తాళ్లపాక అనూరాధ, పనబాక భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...

### తూర్పుకనుపూరులో.. 14 నుంచి ముత్యాలమ్మ జాతర

జిల్లాలోని ప్రసిద్ధ గ్రామదేవత, చిల్లకూరు మండలం తూర్పు కనుపూరుగ్రామంలో వెలసివున్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర మార్చి 14వ తేది నుంచి వైభవోపేతంగా జరుగనుందని ఆలయ వర్గాలు తెలిపాయి. నాలుగురోజుల పాటు జరిగే ఈ జాతరలో చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక, జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొంటారు.

### విడవలూరులో.. మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన

విడవలూరులోని పిఆర్ఆర్ అండ్ విఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఇటీవల విడవలూరు ఎస్ఐ ఆంజనేయులు మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కలిగించారు. మాదకద్రవ్యాలు, మత్తుపదార్ధాలు ఆరోగ్యంతో పాటు జీవితాలను సర్వనాశనం చేస్తాయని, అందరూ వాటికి దూరంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, ఏవి ప్రసాద్ పాల్గొన్నారు.

### కొలనుకుదురులో.. దుస్తులు పంపిణీ

మనుబోలు మండలంలోని కొలనుకుదురు గ్రామంలో ఈనెల 26న పీపుల్స్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో 43 నిరుపేద గిరిజన కుటుంబాలవారికి, ఆ గ్రామ సర్పంచ్ తూపిలి వెంకటరమణయ్య చేతులమీదుగా దుస్తులు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు పోతుగుంట మల్లికార్జునరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### చెంగాళమ్మ సేవలో..'ద్వారకా తిరుమల' ఇఓ

తెలుగు తమిళ ప్రజల ఆరాధ్యదైవం సూళ్ళూరుపేట శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని ఫిబ్రవరి 26న ద్వారకా తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం కార్యనిర్వహణాధికారి వి.త్రినాథరావు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఇఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, అర్చకులు ఆయన్ను సాదరంగా స్వాగతించి అమ్మవారి వద్ద పూజలు చేయించారు.

### ఆత్మకూరులో హాస్టళ్ళ తనిఖీ

జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య ఈనెల 26న ఆత్మకూరులోని బీసీ బాలికలు, బాలుర హాస్టళ్ళను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. హాస్టళ్ళ నిర్వహణ సక్రమంగా ఉండాలని, విద్యాప్రమాణాలు పెంచాలని సూచించారు. విద్యార్థులకు మంచి ఆహారం పెట్టాలని, వసతుల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సంబంధిత సిబ్బందిని హెచ్చరించారు.

### గంగపట్నం చాముండేశ్వరిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఇందుకూరుపేట మండలం గంగపట్నంలో కొలువైవున్న శక్తిదేవత శ్రీ చాముండేశ్వరి అమ్మవారికి ఈనెల 26న ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలుచేశారు. తొలుత అమ్మవారిని పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ఇఓ శాంతయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### రామతీర్థంలో.. ఏడుగురు పేకాటరాయుళ్ళ అరెస్ట్

విడవలూరు మండలంలోని రామతీర్థంలో ఉన్న పాతూరులో గత కొద్దినెలలుగా జరుగుతున్న పేకాటబృందంపై ఇటీవల విడవలూరు ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి ఏడుగురు పేకాటరాయుళ్ళను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 2600లతో పాటు 9 మోటారు వాహనాలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదుచేశారు.

### కొండబిట్రగుంట ఆలయానికి.. రూ.17.63 లక్షల ఆదాయం

బోగోలు మండలం కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయానికి హుండీల్లో భక్తులు వేసిన కానుకల ద్వారా 17లక్షలా 63వేలా 771 రూపాయలు రాబడి వచ్చిందని ఆలయవర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 27వ తేదిన ధరకర్తల మండలి ప్రతినిధులు, దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు జరిగిందని వారు పేర్కొన్నారు.

# కళ్యాణ వైభవం...!



నెల్లూరు వాస్తవ్యులు చుండూరు సుధీర్ - వైష్ణవిల కుమార్తె సుసాహిత్య వర్ధిని - వెంకట అభిరామ్ (ఒంగోలు వాస్తవ్యులు కొనిజేటి వెంకటరమణ - పద్మావతిల కుమారుడు)ల కల్యాణం ఫిబ్రవరి 23వ తేదీ నెల్లూరులోని పిఎస్ఆర్ కన్వెన్షన్ నందు వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.

## కృతజ్ఞతాపూర్వక కలయిక



రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ఛైర్మెన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, ఇటీవల కోవూరు శాసనసభ్యులు నలపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన నివాసంలో కలుసుకుని, తనకు పదవి రావడంలో సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకూరుపేట కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మెన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి కూడా వారి వెంట ఉన్నారు.

# ఏఐసీసీ సభ్యునిగా చేవూరు శ్రీధర్‌రెడ్డి



ఆత్మకూరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న చేవూరు శ్రీధర్‌రెడ్డి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యునిగా నియమితులయ్యారు. తనకు ఈ పదవి దక్కడం పట్ల కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు కేవీపీ రామచంద్రరావు, పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు శ్రీధర్‌రెడ్డికి అభినందనలు తెలియజేశారు.

# బిజెపి అభ్యర్థులను గెలిపించండి




రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి తరఫున పోటీచేస్తున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు బ్రహ్మానందం, దయాకర్‌రెడ్డిలను గెలిపించాలని బిజెపి నాయకులు విజ్ఞప్తి చేశారు. మార్చి 1న నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో నిరుద్యోగం పెరిగిపోతోందని విమర్శించారు. ఇది మాటల ప్రభుత్వమే కానీ చేతల ప్రభుత్వం కాదని, ప్రభుత్వం ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని దుయ్యబట్టారు. బిజెపి నాయకులు భరత్‌కుమార్‌యాదవ్, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, జి.విజయకుమార్, మిడతల రమేష్, యశ్వంత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీ స్కూలు విద్యార్థినికి..డిఇఓ అభినందన

## రాష్ట్రస్థాయిలో 'భావన'కు..ద్వితీయ బహుమతి



రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లాకు ద్వితీయస్థానం లభించింది. బోగోలు మండలం జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని వై.భావన రూపొందించిన 'ఎకో ఫ్రెండ్లీ ఫార్మర్ స్టిక్' అనే నమూనాకు రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి రావడం విశేషం. మార్చి 1న నెల్లూరులోని డిఇఓ కార్యాలయంలో భావనను డిఇఓ గంగాభవాని అభినందించారు. రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లాకు రెండవస్థానం దక్కడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, జిల్లా సైన్స్ అధికారి జి.శ్రీనివాసులు, ఎంఇఓ జయంత్‌బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చెంచులక్ష్మి, గైడ్ టీచర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జీరోని.. హీరోని చేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఆవిష్కరింపబడిన పార్టీ. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావమైన 9 నెలలోనే అధికారంలోకి వచ్చింది. అదే వైసీపీ... జగన్‌మోహన్‌రెడ్డి 10 సంవత్సరాల కష్టం ఫలితంగా 2019లో అధికారం చేజిక్కించుకుంది. 2009లో రాజశేఖరరెడ్డి దివంగతులైన రెండేళ్ళ తరువాత 2011లో సొంతపార్టీ పెట్టారు జగన్. అప్పటివరకు ఓదార్పు పేరుతో ఓర్పుగా తిరిగాడు. అప్పటి అధికార కాంగ్రెస్‌పార్టీ పెట్టిన అగ్నిపరీక్షలను భరించారు. తప్పనిసరి పరిస్థితులలో 2011లో పార్టీ ప్రారంభించారు. సుదీర్ఘకాలం ఉద్యమాలు, దీక్షలు, పాదయాత్రల తరువాత 2019 లో అనూహ్యంగా 151 సీట్లతో అధికారపగ్గాలు చేపట్టారు.

## జగన్ తప్పటడుగులు వేస్తున్నాడా...?

ఒక దీక్షతో, తపనతో, లక్ష్యంతో, ఆశయంతో శ్రమించి ప్రజల మనసులను దోచుకున్న జగన్ ఇప్పుడు తప్పటడుగులు వేస్తున్నాడా..? అన్న అనుమానాలు రాజకీయ విశ్లేషకుల నుండి వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్ష నేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి కుమారుడు లోకేష్ చేపట్టిన 'యువగళం' విషయంలో జగన్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఆ యాత్రకు అనవసరమైన ప్రాధాన్యతని, ప్రాముఖ్యతని, ప్రచారాన్ని కల్పిస్తున్నాయన్నది విశ్లేషకుల భావన. నిజానికి లోకేష్ పాదయాత్రకు ఆ పార్టీ శ్రేణులు ఊహించిన స్థాయిలో స్పందన రాలేదు. పేరుకి యువగళం అయినా యాత్రలో యువదళం అంతగా కనిపించడం లేదు. అయితే ప్రభుత్వం కలిగిస్తున్న ఆటంకాలు, యాత్రలో నిబంధనల ఉల్లంఘన అంటూ పెడుతున్న కేసులు ప్రజలలో యాత్రపై ఆసక్తిని పెంచుతున్నాయన్నది విశ్లేషకులు అంటున్న మాట.

జగన్ పక్కన చేరిన సలహాదారులు పాడు సలహాలతో తమ నాయకుడిని తప్పుదోవ పట్టించి ఆయనకు కీడు చేస్తున్నారన్న మాట విశ్లేషకుల నుండి వినపడుతోంది. లోకేష్ యాత్రను చూసీ చూడనట్లుగా, పట్టీ పట్టనట్లుగా వదిలేస్తేనే జగన్ ప్రభుత్వానికి మంచిదన్న అభిప్రాయాన్ని వైసీపీ పార్టీ శ్రేణులే వ్యక్తపరుస్తున్నాయి.

చిత్తూరు జిల్లాలో జరిగిన 30రోజుల పాదయాత్రలో 12 కేసులు నమోదైతే వాటిలో 9 కేసుల్లో పోలీసులే ఫిర్యాదుదారులు కావడం గమనార్హం. ఒకే కేసులో వి.ఆర్.ఓ ఫిర్యాదుదారైతే.. మిగిలిన రెండు ప్రజలనుండి వచ్చినవి. తమ యాత్రకు భయపడ్డ ప్రభుత్వం తమను అడుగడుగునా అడ్డుకుంటోందని ప్రచారం చేసుకోవడానికి ఈ చర్యలు లోకేష్‌కి ఉపయోగపడుతాయి తప్ప, ప్రభుత్వానికి చేకూరే ప్రయోజనమేమి లేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. సమర్ధత లేని సలహాదారుల మాట విని, జీరోగా ఉన్న వ్యక్తికి అనవసరపు ప్రచారం కల్పించి తమ పార్టీయే లోకేష్‌ని హీరోని చేస్తోందని వైసీపీ వర్గాలే చెవులు కొరుక్కోవడం కొసమెరుపు...!

# పార్టీ సేవకు.. ఇక సెలవు!

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం సబబేనా అన్నది కూడా పార్టీవర్గాల్లో లోలోపలే చర్చగా ఉన్నట్లు తెలుస్తోంది. రాహుల్ భారత్‌జోడో యాత్ర భేషైనదేనని ఆమె ఈ సందర్భంగా కితాబునివ్వడం, పరోక్షంగా రాహుల్‌ను తన వారసుడిగా ప్రకటించినట్లే కదా!.. అని అందరూ భావిస్తున్నారు. అయితే, రాహుల్ ఒక్కరే మునిగిపోతున్న కాంగ్రెస్‌నావను గట్టెక్కించ గలడా?.. ఎన్నికల రణరంగంలో బిజెపి ధాటికి ఖర్గే తట్టుకోగలరా?.. అన్న సందేహాలు కాంగ్రెస్‌వర్గాల్లో అంతర్గతంగా నలుగుతున్నట్లు సమాచారం. బిజెపి విధానాలను తూర్పారబట్టడం, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని పార్టీ అధినేత్రిగా ఈ ప్లీనరీలో సోనియా దిశా నిర్ధేశం చేయడం..వంటివన్నీ అందరూ ఊహించినవే. అయితే, ఎవరూ అనుకోనిదేమైనా ఉంటే, అది ఆమె ఉన్నట్లుండి తన రాజకీయ ప్రస్థానం ముగిసిందన్నట్లుగా చెప్పడమే. అయితే, ఆమె పూర్తిగా రాజకీయాల నుంచి వైదొలగుతారా లేదా అన్న విషయంలో వాస్తవానికి ఇంకా స్పష్టత లేదు. రానున్న ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీశ్రేణులకు చివరగా ఆమె ఇచ్చిన పిలుపుతో, భావసారూప్యత కలిగిన పార్టీలతో కలసి బిజెపికి వ్యతిరేకంగా పోరాడాలని కాంగ్రెస్ వర్గాలు సమాలోచనలు చేస్తున్నాయి. కానీ అవన్నీ ఎంతవరకు ఫలవంతమవుతాయో కాలమే చెప్పాలి.

దేశవ్యాప్తంగా బిజెపి అప్రతిహతంగా అనేక రాష్ట్రాల్లో విజయం సాధించి చక్రం తిప్పుతున్న నేపథ్యంలో, గతంలో దేశాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన కాంగ్రెస్‌పార్టీ ఇటీవలి కాలంలో ఆత్మరక్షణలో పడిపోయింది. కాంగ్రెస్‌పార్టీ చేతులారా చేసుకున్న స్వయంకృతాపరాధాలే అందుకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు దేశంలో ఎన్నెన్ని లక్షల కోట్ల కుంభకోణాలో చెప్పలేం. కుంభకోణాల పార్టీగా కాంగ్రెస్ అప్రదిష్ట పాలైంది. సోనియాగాంధీ నాయకత్వంలో దేశం ప్రగతి సాధిస్తుందని అనుకుంటున్న తరుణంలో ఆ పార్టీ నిర్ణయాలు, అస్తవ్యస్త విధానాలు దేశాన్ని మరింత అధోగతి పాలుచేశాయి. ప్రాధాన్యత కలిగిన వ్యవస్థలను పట్టించుకోకపోవడం, ఎక్కడ చూసినా అవినీతి అక్రమాలు పెరిగిపోవడం, నిరుద్యోగం – దారిద్ర్యం ప్రబలిపోవడం, ప్రజలు కాంగ్రెస్ విధానాల పట్ల విసిగిపోతున్న పరిస్థితుల్లో, ఆంధ్ర రాష్ట్ర విభజనను అడ్డగోలుగా చేసిపారేసి, ఆంధ్రులకు మొండిచేయి చూపడంతో కాంగ్రెస్ అస్తవ్యస్త విధానాలు పరాకాష్టకు చేరిపోయాయి. కనీసం రాజధాని కూడా లేకుండా, అన్యాయంగా ఆంధ్రను తమ రాజకీయాలకు బలిచేసిన పాపం ఊరకే పోలేదు. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న ఆంధ్రనే అనైతికంగా.. అత్యంత ఘోరంగా ముక్కలు చేసేయడంతో, దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌పై వ్యతిరేకత వెల్లువెత్తింది. చివరికి ఆ పార్టీ అథ:పాతాళానికి చేరిపోయింది. మహామహులెందరో ఉన్న కాంగ్రెస్ చివరికి ఆంధ్ర లాగానే అనాథగా అయిపోయింది. ఈ ప్లీనరీలోనే 'ఆంధ్ర ప్రదేశ్‌కి ప్రత్యేకహోదా కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని' కాంగ్రెస్ ప్రకటించడం కొసమెరుపు. జరగాల్సిన ఘోరమంతా జరిగిపోయాక ఇప్పుడెన్ని తీర్మానాలు చేసినా ఆంధ్రకు ఒరిగేదేం ఉంటుంది?..చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా, ఎవరెంత ప్రయత్నంచేసినా ఎవరెన్ని ఊరడిరపు యాత్రలుచేసినా.. ఇక ఎవరూ ఉద్ధరించలేనంత అట్టడుగుస్థాయికి కాంగ్రెస్ చేరిపోయింది. బిజెపి అధికారంలోకి వచ్చి, ప్రధానిగా మోడీ వచ్చాక బిజెపి ధాటికి తట్టుకోలేక కాంగ్రెస్ పూర్తిగా చతికిలబడిపోయింది. ఒకటొకటిగా అనేక రాష్ట్రాల్లో కనుమరుగైపోయింది. నిరాశానిస్పృహలు ఆవరించి, పార్టీ భవిష్యత్తు అంతా అగమ్యగోచరంగానే మిగిలిపోయింది.

ఇటలీలో పుట్టిపెరిగిన సోనియా, రాజీవ్‌గాంధీ భార్యగా, ఇందిరాగాంధీ కోడలుగా భారత్‌లో అడుగుపెట్టి, దేశ రాజకీయాల్లో ఎన్నో సంచలనాలు సృష్టించింది. రాజీవ్ మరణంతో దేశంలో రాజకీయ అస్థిరత ఏర్పడినప్పుడు సోనియాను ప్రధాని చేయాలని కాంగ్రెస్‌వారంతా పట్టుబట్టినా, అందుకు ఆమె అంగీకరించకపోవడం అప్పట్లో పెద్ద సంచలనం. ఆ తర్వాత ఆమె పార్టీలో చేరి, కాంగ్రెస్‌కు అధ్యక్షురాలయ్యారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు సోనియా ప్రతిపక్ష నాయకురాలిగా ఉన్నారు. అఖిలభారత కాంగ్రెస్‌కు నాలుగుసార్లు అధ్యక్ష బాధ్యతలు నిర్వహించిఆ పార్టీకి సుదీర్ఘకాలం అధ్యక్షత్వం వహించిన నేతగా రికార్డు సృష్టించారు. యుపిఏ ఛైర్‌పర్సన్‌గా దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారు. తాజాగా, ఆమె రాజకీయ విరమణ ప్రస్తావనతో కాంగ్రెస్ భవిష్యత్తు ఇక ఏ మలుపు తిరుగుతుందో వేచిచూడాల్సిందే మరి! అయితే "ఆమె రిటైర్మెంట్‌తో పార్టీకి మంచిరోజులు వస్తాయని", "భవిష్యత్‌లో యువతకు నాయకత్వపు అవకాశాలు వచ్చే అవకాశం ఉందని, తద్వారా పార్టీకి పూర్వవైభవం వస్తుంది" అని కాంగ్రెస్‌వర్గాలు ఆశిస్తున్నాయి.

## గోడౌన్ల నిర్మాణాలు

# త్వరితగతిన పూర్తిచేయాలి

వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు వీలుగా జిల్లాకు మంజూరైన బహుళార్ధ సౌకర్యాల కేంద్రాల (గోడౌన్ల) నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 27న జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గోడౌన్ల నిర్మాణాలపై సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి అమలు కమిటీ సమావేశం నిర్వహించి గోదాముల నిర్మాణాల పురోగతి, నిర్మాణ పనులకు సంబంధించిన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మంజూరైన 48 గోదాములకు గాను 33 గోదాములు పూర్తికాగా, మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. గోదాముల నిర్మాణాలను పూర్తిచేసి ఈ సీజన్లోనే వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిసిఓ తిరుపాల్‌రెడ్డి, నాబార్డ్ డిడిఎం రవి సింగ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ రాజు, జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి, మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అనిత, డిఈ ఏవీఎస్ నారాయణరావు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## తోడేరు మృతుల కుటుంబాలకు..

# రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా


పొదలకూరు మండలం తోడేరులో జరిగిన పడవ ప్రమాదంలో మృతిచెందిన ఆరుగురు కుటుంబాల వారికి మంగళ వారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక్కొక్క కుటుంబానికి 5 లక్షల రూపాయల వంతున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఆ కుటుంబాల వేదనను మంత్రి కాకాణి సిఎం దృష్టికి తీసుకువెళ్ళడంతో, సిఎం వెంటనే స్పందించి మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించి, ఆ మేరకు సాయం అందజేస్తున్నట్లు తెలిపారు.



# నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో క్రీడాపోటీలు

నెల్లూరులోని నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఫిబ్రవరి 27న నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఖోఖో(స్త్రీలు), వాలీబాల్, షాట్‌పుట్, 100మీటర్ల తదితర పోటీలు జరిగాయి. ముఖ్యఅతిథులుగా జిల్లా సివిల్ సప్లైస్ అదనపు కలెక్టర్ సుధాకర్, జిల్లా యువజన అధికారి ఏ.మహేంద్రరెడ్డి, సెట్నల్ సీఈవో పుల్లయ్య, చీఫ్‌కోచ్ యతిరాజు, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్, ఏపియుడబ్ల్యుజె నాయకుడు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఖోఖో విజేతగా కేవిఎన్ఆర్ టీం, రన్నర్స్‌గా ఉమెన్స్ పాలిటెక్నిక్ కాలేజ్ నిలిచాయి. వాలీబాల్ విజేతగా కెసిడిసి టీం, రన్నర్స్‌గా వెంకటగిరి జట్టు నిలిచాయి.

# టీడీపీ... జనసేన మధ్య మళ్ళీ అంతరం!?



రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రాగలమని భావిస్తున్న తెలుగుదేశం పార్టీకి, అసెంబ్లీ ఎన్నికల్లో 'మీరు ఎలా గెలుస్తారో చూస్తా...!' అంటూ వైసీపీని సవాలు చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కి మధ్య మళ్ళీ ఇప్పుడు గ్యాప్ ఏమైనా వచ్చిందా?

రాష్ట్ర రాజకీయాల పరిశీలకులకు ఈ విషయమే ఇప్పుడు ఒక పట్టాన అర్ధం కావడం లేదు.

తెలుగుదేశం పార్టీతో వెళితే తప్ప, అసెంబ్లీ మొహం చూసే పరిస్థితి లేదని జనసేనలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారిలో పలువురు ముఖ్యులు గట్టిగా అభిప్రాయపడుతున్నారు. తాము తెలుగుదేశంతో కలిసే ఎన్నికల్లో పోటీ చేస్తామంటూ వారు ఇప్పటికే మానసికంగా సిద్ధమైపోయారు. అలా కుదరక పోతే, జనసేన నాయకులు పోటీ నుంచి విరమించవచ్చు కూడా. అదీ, జనసేన క్షేత్రస్థాయి పరిస్థితి.

ఇక, తెలుగుదేశంలో కార్యకర్తల మానసిక పరిస్థితి కూడా ఇంచుమించు ఇలాగే ఉంది. జనసేనతో కలిసి ఎన్నికలకు వెళితే... 175కు 130 సీట్లు, 55 శాతం ఓట్లు ఖాయమంటూ టీడీపీ అనుకూల రాజకీయవర్గాలలో ఒక ప్రచారం గట్టిగానే సాగుతోంది.

మరోపక్క, జనసేన సొంతంగా పోటీ చేయాలనే భావం కూడా ఆ పార్టీలో గట్టిగా ఉన్నట్టుగానే, తెలుగుదేశం కూడా పొత్తులూ... గిత్తులూ లేకుండా పోటీ చేసినా అధికారం ఖాయం అనే భావం కూడా టీడీపీలో గట్టిగానే ఉంది.

కానీ, 2019 అనుభవం నేపథ్యంలో సొంతంగా వెళ్ళాలనే నిర్ణయానికి పవన్ కళ్యాణ్ రాలేకపోతున్నారు. అలా అని చెప్పి, తెలుగుదేశం పార్టీని బేషరతుగా ఆలింగనం చేసుకోలేకపోతున్నారు. తెలుగుదేశం పరిస్థితి కూడా సేమ్... టు... సేమ్.

సొంతంగా పోటీ చేయాలనే ఉత్సాహం లోలోపల ఉన్నప్పటికీ ఒక నిర్ణయానికి తెలుగుదేశం రాలేకపోతోంది. అలా అని చెప్పి, జనసేనతో అరమరకలు లేని పొత్తు దిశగా అడుగులు వేయలేకపోతోంది.

కాలమే తమ సమస్యను పరిష్కరిస్తుందిలే అన్నట్టుగా అటు చంద్రబాబు నాయుడు, ఇటు పవన్ కళ్యాణ్ వ్యవహరిస్తున్నారా అని అనిపిస్తుంటుంది ఒక్కొక్కసారి.

ఆ మధ్య ఒకసారి చంద్రబాబు వెళ్లి పవన్ కళ్యాణ్‌ను విజయవాడ నోవాటెల్ హోటల్‌లో కలిశారు. విశాఖపట్నంలో పోలీసులు బాగా ఇబ్బందిపెట్టిన పవన్ కళ్యాణ్‌ను ఓదార్చి, సంఘీభావం వ్యక్తం చేయడానికి తాను వచ్చానని చంద్రబాబు చెప్పారు. పొత్తులు, ఎత్తులకు రాలేదని ఆయన చెప్పారు. ఆ తరువాత కొన్నాళ్లకు, హైదరాబాద్‌లో పవన్ కళ్యాణ్ చంద్రబాబు ఇంటికి వెళ్లి కలిశారు. కుప్పంలో పోలీసుల చేతిలో బాగా ఇబ్బందిపడిన చంద్రబాబుకు సంఘీభావం తెలపడానికి తాను వచ్చానని పవన్ కళ్యాణ్ చెప్పారు. 'తగిన సమయం'లో పొత్తులు, ఎత్తులు ఖరారు చేస్తాం అని ఇరువురు నాయకులూ మీడియాకు చెప్పారు.

దీంతో, ఇద్దరూ కలిసి పోటీ చేయబోతున్నట్టు మీడియా ఊదరగొట్టేసింది. ఇరువురి మధ్య అంతరాలు సమసిపోయాయనే భావన సర్వే సర్వత్రా వ్యక్తమైంది. పవన్ కళ్యాణ్‌పై వైసీపీ నేతలు మూకుమ్మడిగా చేసిన విమర్శల దాడితో, టీడీపీ – జనసేన పొత్తు ఖరారైందనే భావన కూడా బలపడింది.

అంతే! ఆ తరువాత... ఆ పార్టీ ఆఫీసు మీద వాలిన కాకి, ఈ పార్టీ ఆఫీసు మీద వాలలేదు. ఎవరి పార్టీ కార్యక్రమాలు వారు చేసుకుంటున్నారు.

చంద్రబాబు జిల్లా పర్యటనలకు వెళుతున్నారు. తెలుగుదేశం కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానులు, సానుభూతిపరులు, ఇతరులు పెద్దఎత్తునే చంద్రబాబు సభలకు వస్తున్నారు. ఆ సభల్లో చేసే ప్రసంగాల్లో... జనసేన పేరును చంద్రబాబు ప్రస్తావించడం లేదు. పైపెచ్చు, టీడీపీ అభ్యర్థుల్ని కూడా ప్రకటిస్తున్నారు.

మాట వరుసకు కాకినాడ జిల్లా పెద్దాపురం నుంచి నిమ్మకాయల రాజప్ప మూడోసారి పోటీ చేస్తారని, ఆయనను గెలిపించాలని చంద్రబాబు ప్రజలను కోరారు. అలాగే, ఆ పక్కనున్న జగ్గంపేటలో జ్యోతుల నెహ్రూ పోటీ చేస్తారని బాబు జగ్గంపేట సభలో ప్రకటించారు.

ఇక్కడ ఓ చిన్న మెలిక లేకపోలేదు.

ఈ రెండూ కాపు ఓటర్లు గట్టిగా ఉన్న నియోజకవర్గాలు. జనసేన అంటే కాపుల పార్టీ అనే ముద్ర పడిపోయింది. దాని బలం కూడా గోదావరి జిల్లాలే అని కూడా అంటారు. రేపొద్దున్న, టీడీపీతో జత కుదిరితే జగ్గంపేట, పెద్దాపురం తనకు కావాలి అని పవన్ కళ్యాణ్ పట్టుబడితే... చంద్రబాబు ఇరకాటంలో పడిపోరా అనేది పాయింట్. అందుకే, జనసేనతో టీడీపీకి పొత్తు లేదా అన్న అనుమానాలు కూడా వస్తున్నాయి.

వీటికితోడు, ఆంధ్రజ్యోతి ఎం.డి వేమూరి రాధా కృష్ణ జనం మీద ఓ 'కొత్త పలుకు' వదిలారు.

పవన్ కళ్యాణ్ టీడీపీ వైపుకు వెళ్లకుండా...






విడిగానో, లేదా ఆంధ్రలో బీఆర్ఎస్‌తో కలిసి వెళ్ళడానికి సుముఖంగానో ఉంటే... ఎన్నికల ఖర్చు వెయ్యి కోట్లు అయినా ఇబ్బంది లేదంటూ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్... పవన్ కళ్యాణ్‌కు కబురు మీద కబురు పంపి ఆయనను బాగా విసిగిస్తున్నారు అనేది ఆ 'కొత్త పలుకు' సారాంశం.

దీంతో జనసేన కార్యకర్తలు, ముఖ్యులు వేమూరి రాధాకృష్ణ మీద విరుచుకుపడ్డారు. 'మెగా మధ్యముడు' నాగబాబు కూడా జనసైనికులకు మద్దతుగా నోరు వాడారు(జనరల్‌గా ఆయన నోరే వాడుతారు). మొత్తంమీద ఈ గొడవల్తో జనసేన.... టీడీపీ మధ్య కాస్తంత అంతరం పెరిగిందా అనే వాతావరణం ఏర్పడింది. దీంతో, మళ్ళీ 'మరో పలుకు'ను రాధాకృష్ణ రాయాల్సి వచ్చింది, మొదటిదానికి కొనసాగింపుగా.

మొత్తం మీద జనసేన చుట్టూ ఈ వారం డబ్బు అంశం తిరిగింది.

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చినట్టుగా చెబుతున్న 'ఆఫర్'ను పవన్ కళ్యాణ్ కన్నెత్తి చూడక పోయినప్పటికీ జనసేన – టీడీపీ పొత్తు భావనలో ఓ రకమైన స్తబ్దత నెలకొంది.

ఇంతకీ, ఈ రెండింటి మధ్య పొత్తు ఉంటుందా... ఉండదా? ఉంటే... పొత్తు షరతులు ఏమిటి? జనసేనకు ఎన్ని సీట్లు టీడీపీ కేటాయిస్తుంది? ఎక్కడ? మరి, ఎన్నికల వ్యయం(నియోజకవర్గానికి ఓ యాభై కోట్లు) పరిస్థితి ఏమిటి? ఆ భారమూ తెలుగుదేశం పార్టీదేనా? నారు పోసినవాడే నీరు కూడా పోయాలా? ఏ ఏ జిల్లాల్లో? రెండూ కలిసి ఎన్నికల్లో విజయం సాధిస్తే, మంత్రివర్గంలో జనసేన పాత్ర ఏమిటి? ఎన్ని మంత్రి పదవులు వస్తాయి? లోక్‌సభ, రాజ్యసభ, శాసనమండలి ఎన్నికల్లో జనసేనకు షేర్ ఉంటుందా? ఒకవేళ, అవసరార్ధం పొత్తు కుదిరినా... ఎన్నాళ్ళు కలిసి ఉంటారు? మొదలైన సందేహాలు అనేకం రాజకీయవర్గాల బుర్రలు తొలిచేస్తున్నాయి. కానీ, తెలుగుదేశం నాయకులు గానీ, జనసేన ముఖ్యులు గానీ ఏ విషయంలోనూ నోరు మెదపడం లేదు. 'వ్యూహాత్మక మౌనం' పాటిస్తున్నాయి. వేమూరి రాధాకృష్ణ చెబుతున్నట్టు, పవన్ కళ్యాణ్‌ను బుట్టలో వేయడానికి తెలంగాణ ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నది నిజమే అయితే... పవన్ కళ్యాణ్‌ను ఆయన ఓ పట్టాన వదలరు. జనసేన – తెలుగుదేశం పార్టీల మధ్య గ్యాప్ ఏర్పాటు అనేది అప్పుడు నిజంగా నిజమయ్యే అవకాశాలు లేకపోలేదు. ఇటువంటి సందేహాలు అనేకం రాజకీయవర్గాల్లో షికార్లు చేస్తున్నాయి.

ఈ పరిస్థితుల్లో, తమ మధ్య పొత్తుకు సంబంధించి, ఈ రెండు పార్టీలూ స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. లేకపోతే, చివరి నిముషంలో ఒక పార్టీ ఓట్ బ్యాంకు మరో పార్టీకి బదిలీ అయ్యే అవకాశాలు తగ్గిపోతాయి. పొత్తు ఉండాలీ అనుకుంటే మాత్రం... ఇరు పార్టీల అగ్రనేతలు చొరవతీసుకోవలసిన సమయం వచ్చేసింది. దాగుడు మూతల సమయం ముగిసింది.

- పొత్తు చర్చలకు రెండు పార్టీలూ చెరో ఉపసంఘాన్ని ఏర్పాటు చేసుకోవాలి.
- ఈ రెండు ఉప సంఘాలు కలిసి, జనసేన – టీడీపీ ఎన్నెన్ని స్థానాల్లో పోటీచేసే పరిస్థితులు ఉన్నాయో ఓ అంచనాకు రావాలి.
- ఈ కసరత్తు అయ్యాక, రెండు పార్టీల నేతలు.... ఉమ్మడి కార్యక్రమం దిశగా ఆలోచించగలరేమో పరిశీలించుకోవాలి.

ఇలా వివిధ దశలు దాటుతున్న సంకేతాలు ఎప్పటికప్పుడు ప్రజల్లోకి బలంగా వెళ్ళాలి.

ఉమ్మడి ప్రచారం దిశగా రెండు పార్టీల నేతలు సమాయత్తం కావాలి. అంటే, ఒకే వేదికను అటు చంద్రబాబు, ఇటు పవన్ కళ్యాణ్ పంచుకోవాలి.

ఇలా, ఖరారు చేసుకోవలసిన పలు అంశాలు అనేకం కనపడుతుండగా ఈ రెండు పార్టీలలోనూ కనపడుతున్న స్తబ్దత... 'గ్యాప్'కు సంబంధించి కొత్త సందేహాలకు దారి తీస్తోంది.

తెలుగుదేశం పార్టీయే పొత్తు దిశగా చొరవ తీసుకోవలసిన అవసరం ఉంది. మేజర్ ప్లేయర్ తెలుగుదేశమే కనుక. చంద్రబాబుకు, టీడీపీకి కూడా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దిశా నిర్దేశం చేస్తాయి. పవన్ కళ్యాణ్‌కు పోయేదేమీ లేదు.

అందుకే, 'అంతరం' అనే వార్తలు/ పుకార్లకు రెక్కలు రాకుండా టీడీపీ చూసుకోవాలి, జనసేనతో కలిసి ఎన్నికలకు వెళ్ళాలి అనుకుంటే.

పరస్పర విశ్వసనీయతకు ఇబ్బంది కలుగకుండా టీడీపీ చూసుకోవాలి.

అవతల, 175కి 175 అని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటిస్తున్న విషయాన్ని ఈ రెండు పార్టీల అధినేతలూ పరిగణనలోకి తీసుకుని, ఎటువంటి అపోహలు లేని వ్యూహానికి శ్రీకారం చుట్టుకోగలగాలి. అంతటి రాజకీయ పరిపక్వతను పవన్ కళ్యాణ్, చంద్రబాబునాయుడు ప్రదర్శిస్తారేమో చూడాలి.

ఎందుకంటే, ఎన్నికలకు ఇంకా ఏడాది సమయం లేదు. అవి రేపే జరగబోతున్నాయి.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

# శ్రీలంకలోనూ.. శ్రీసిటీ తరహా పారిశ్రామికవాడ!

## - ఏర్పాటుకు డా. రవీంద్ర సన్నారెడ్డికి ఆహ్వానం




శ్రీలంకలో శ్రీసిటీ మోడల్ ఇండస్ట్రియల్ సిటీని ఏర్పాటు చేయాలంటూ శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డికి చెన్నైలోని శ్రీలంక డెప్యూటీ హైకమిషనర్ డాక్టర్ డి.వెంకటేశ్వరన్ ఆహ్వానం పలికారు. మార్చి1న ఆయన శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని, ప్రత్యేకతలను వివరించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ప్రత్యేకతలు, మౌళిక సదుపాయాలు, వ్యాపారానుకూల వాతావరణాన్ని వెంకటేశ్వరన్ ప్రశంసించారు. మేక్ఇన్ ఇండియా తరహాలో 'మేక్ ఇన్ శ్రీలంక' అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషిచేస్తోందని ఆయన చెప్పారు. భారత్‌తో ఏళ్ళతరబడి తమకున్న అనుబంధాన్ని ప్రస్తావించిన ఆయన, ఇరుదేశాల వ్యాపార బంధం మరింత పటిష్టం చేయడానికి పరస్పర సహకారం అవసరమన్నారు. శ్రీలంకలో శ్రీసిటీ తరహా పారిశ్రామికవాడ ఏర్పాటుకు ఆయన ఆహ్వానించారు.

# శ్రీసిటీని సందర్శించిన.. అరుణాచల్‌ప్రదేశ్ విద్యార్థులు



అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఎన్ఐటి, ఇతర విద్యాసంస్థల నుంచి 28 మంది విద్యార్థులు, అధ్యాపకులు మార్చి 1న శ్రీసిటీని సందర్శించారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ చొరవతో 'ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్' యువసంఘం కార్యక్రమంలో భాగంగా, 5 రోజుల ఆంధ్రప్రదేశ్ పర్యటనలో వారు ఇక్కడకు వచ్చారు. వారికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి చర్చల్లో పాల్గొన్న ఆయన, దేశ సమైక్యతను చాటిచెబుతూ దేశంలోని విభిన్న ప్రాంతాలు, సంస్కృతులు, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేసే ఈ కార్యక్రమానికి శ్రీసిటీని ఎంపిక చేయడం తాము గౌరవప్రదంగా భావిస్తున్నామన్నారు. 'ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్' స్ఫూర్తికి శ్రీసిటీ చక్కని ఉదాహరణగా నిలుస్తుందన్నారు. భారత్‌తో సహా 28 దేశాలకు చెందిన పరిశ్రమల ఏర్పాటుతో దేశ విదేశాలకు చెందిన ప్రజలు ప్రశాంత జీవనం సాగిస్తున్న ఈ ప్రాంతం వివిధ భాషలు సంస్కృతులకు నిలయంగా మారిందన్నారు. భవిష్యత్తులో దేశంలో విభిన్న ప్రాంతాలలో ఉద్యోగాలు, వ్యాపారాలు నిర్వహించేందుకు విద్యార్థులకు ఈ కార్యక్రమం అత్యంత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు శ్రీసిటీలోని పలు పరిశ్రమలను, శ్రీసిటీ పరిసరాలను సందర్శించారు.



అమెరికాలో పర్యటిస్తున్న హీరో రామ్‌చరణ్‌తేజతో మన నెల్లూరు ప్రముఖులు డాక్టర్ ప్రేమసాగర్‌రెడ్డి, ఆయన మిత్రుడు ప్రసాద్‌రెడ్డి జి.వి.

# గ్యాస్ ధర..మళ్ళీ భగ్గు భగ్గు!



- మరో రూ.50 పెంచేశారు

మూలిగే నక్కపై తాటికాయ పడినట్లుగా, అసలే కుయ్యో మొర్రోమంటున్న పేదలపై పెరిగిన గ్యాస్ ధర మరో బండలా నెత్తినపడింది. కేంద్రప్రభుత్వం తాజాగా వంట గ్యాస్ సిలిండర్ ధరను మరో 50 రూపాయలు పెంచేసింది. ఇప్పటికే పెరిగివున్న నిత్యావసర సరుకుల ధరలతో సతమతమవుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలు తాజా పెంపుతో మరింత అవస్తలు పడనున్నారు. 8నెలల తర్వాత మళ్ళీ గ్యాస్ ధర 50 రూపాయలు పెంచేసరికి పేదలు ఆవేదన చెందుతున్నారు. హోటళ్లు, రెస్టారెంట్ల వారు వినియోగించే 19కిలోల వాణిజ్య సిలిండర్‌పై మరో 350 రూపాయలు పెంచారు. దీంతో వంట గ్యాస్ ధర 1125 రూపాయలకు, వాణిజ్య సిలిండర్ల ధర 2,119 రూపాయలకు పెరిగింది. వంటగ్యాస్‌ను రాయితీ ధరకే ఇస్తున్నామని చెప్పినా, ఇప్పుడవన్నీ నామమాత్రంగానే మిగిలిపోయాయి. పెట్రోలియం సంస్థలు ఇష్టానుసారంగా ధరలుపెంచేస్తుండడంతో ప్రజలకు ఈ అదనపు కష్టాలు తప్పడం లేదు. కూరగాయల ధరలు సైతం పెరిగిపోయి సామాన్యప్రజలు నిత్యం వాటిని కొనలేక అవస్తలు పడుతుంటే..వంట గ్యాస్ ధర కూడా భగ్గుమనడంతో ప్రజలు, ముఖ్యంగా గృహిణులు ఆవేదనకు, ఆందోళనకు గురవుతున్నారు.




22వ వర్ధంతి

పూజ్యులు

స్వర్గీయ వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు

నిర్యాణం: 06.03.2001

స్వర్గస్తులై 06.03.2023 నాటికి
22 సంవత్సరాలు నిండుతాయి.

వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు:
వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
రాజ్యసభ సభ్యులు


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com